జమిందారీ యుద్యోగముపై వెళ్లి అచ్చటనే స్థిర నివాస మేర్పరచుకొనెను. ఆ వంశము అక్కడి వడ్లపట్ల వారితో సంబంధ బాంధవ్యము లేర్పర్చుకొని అక్కడనే అంతరించినది. ఈ జానకి రామయ్యకు మునిమనుమడగు శేషయ్యను నాతని భార్య – వడ్లపట్లవారి పడుచు అచ్చల్లయను నామె సుమారు 80 సంవత్సరములపై స్త్రీ అంబరు పేటలో నున్నట్లు అప్పుడు ఏలూరులో ప్లీడరీ చేయుచున్న మా నాయన గారికి తెలిసి యామెను ఏలూరునకు తన యింటికి 1887 సంవత్సరములో మా నాయనగారు తీసుకొని వచ్చి తన పోష్యవర్గములోనే యుంచుకొని యుండగా ఆమె 1892 వ సంవత్సరమున చనిపోగా మా నాయన గారే కర్మాంతరములు చేసినారు. ఈ ముసలామెను నేను బాగుగా నెరుగుదును. అచ్చల్లవ్వ యని పిలుచు చుండివాండ్రము. ఈమె వల్లను గూడ మా నాయనగారు వంశచరిత్రను గొంత తెలుసుకొన్నారు. జానకి రామయ్య వంశమటు చెల్లిపోయినది. ఇక మూడవ వాడగు వెంకట్రామయ్య కల్దిండి పరిగణాలో నుద్యోగమునకై పోయి తత్సమీపములో నున్న వెంకటాపురములో స్థిరపడెను. ఈ వెంకటాపురము వారు కల్దిండి సీమలోని గుడిపాటి వారితో వియ్య మందు చుండిరి. ఈ వంశమును అంతరించినది. కాని యీ వంశీకులలో ఇద్దరు దిగువ చెప్పబోవు సంగతులను బట్టి సుందరామయ్య వంశీకులలోని వారికి ఒకరు మోహపుత్రుడు గాను, ఒకడు దత్తుడుగాను వచ్చినట్లు తెలియగలదు. ఈతడు నూజివీడి వారి వలన కొన్ని మాన్యములు వెదురు పావులూరున సంపాదించెను. కాని వానిని ప్రస్తుతము 'శంకర భక్తులయిన' శంకరవారనుభవించుచున్నారని యూహ చేయవచ్చును. ఈతని కాలము నాటికి గోలకొండలో ఖుతుబ్‌షాహ వంశము తుదముట్టినది. మొగలు చక్రవర్తుల పాలయినది. ఔరంగజేబు గతించి యుండును. నైజాముల్ముల్కు రాజప్రతినిధిగా హైదరాబాదులో నుండెను. దేశము కల్లోలముగా నుండెను.

4. మధ్య చరిత్ర

6. గంగరాజు

సుందరామయ్యగారికి గంగరాజను కొడుకుండెను. ఇంతటి నుండి ఈ వంశచరిత్రకు దృఢమైన యాధారములు గలవు. ఈతడు సుమారు 1750 – 60 ల మధ్య ప్రముఖుడయి లౌక్య వ్యవహార ప్రవీణుడై కీర్తిగాంచినవాడు. ఈతని జీవిత పూర్వభాగములో బందరు పట్ల ఫ్రెంచి వారి ప్రభ సాగుచుండెను. ఇంగ్లీషువారు ఉండుటయా ఊడుటయా యని సంశయించిన కాలమిది. కేవలము అదృష్టవశమున, ఈస్టిండియా కంపెనీ వారి అప్పటి సేనానియగు కర్నలు ఫోర్టు కొలది సేనతో అర్ధ రాత్రమున బందరు కోటయొద్ద 1759 సంవత్సరం ఏప్రియలు 7వ తేదీన ఫ్రెంచివారి నోడించెను. ఫ్రెంచివారీ పట్ల తిలోదకముల గ్రహించిరి. బ్రిటీషు వారి పతాకము ఆకాశము ఎగరెగిరి పడుచుండెను. సలాబత్ జంగు హైదరాబాదులో రాజ్యవేలు చుండెను. గాని చకితుడై యుండెను. వాని వలన 14-5-1759 కొంత రాష్ట్రమును గూడ కంపెనీ వారు సాధించి పరిపాలన చేయమొదలిడిరి. (చూ. గో. డి. మ్యా. పరాసుల బహిష్కార భాగము, కృ. డి. మా. పరాసు యుగము). ఈ ప్రాంతములలోనే ఉత్తర సర్కారులు రాజమండ్రీ నవాబగు అన్వరుద్దీన్ గారి ప్రాతినిధ్యములో నుండెను. జమిందారులు స్వేచ్ఛగా చెలరేగు చుండిరి. అప్పుడొక తురుష్కుడు రుస్తుమ్‌ఖాన్ అను నతడు జిల్లెదారుండెను. ఈతడు చండశాసనుడు. తన ఋజు ప్రవర్తన చేత, నిష్కర్షయైన పాలనచేత, కఠిన శాసనముల చేత, జమిందారుల స్వేచ్ఛా విహారము నడచెను. (చూ. కృ. డి. మ్యా.) ఈ రుస్తుం పేరునే బందరులోని రుస్తుంబాదాయును, నర్సాపురము వద్దనున్న రుస్తుంబాదాయును ప్రబలి యుండును. ఇదే సమయములోనే నూజివీడు అప్పారావులకు సగోత్రికులును వారికి అప్పటప్పటికి ఉత్కృష్ట సహాయమును చేయుచు వచ్చిన కమదనవారను వెలమ ప్రభువులు చార్మహలు అను విన్నకోట, గుడివాడ, కలిదిండి భిత్తర్జల్లీ పరగణాలను 1759 ప్రాంతముల స్థిరముగా సంపాదించి గురజలో యాజమాన్యము సాగించారు. (చూ. కృ. డి. మ్యా. దే. భా. పీ.). ఈ కమదన వారే మా వంశమునకు అగ్రహారములు ఈ నాములనిచ్చిన ప్రభువులు. వీరి దానముల ఫలితమింకను మా వంశీకులకు క్షిలో బడుచునే యున్నది. ఇదే సమయములో ఈ గంగరాజు జమిందారుల వద్దనుండుచు బందరులో లౌక్య వ్యవహారముల జక్కబెట్టెను. ఈ గంగరాజు ముస్తాబాదాలో దేశపాండ్యలయి వన్నెకెక్కిన ఆర్వేల వారగు శంకర వారి పడుచును చిన్నమ్మ యనునామెను పెండ్లి యాడెను. ఈ గంగరాజు సుమారు 1770 –

80 వరకు జీవించి యుండును. ఈయన జీవిత కాలములోనే ఈ దిగువ రాబోవు తన కుమారులు ప్రముఖులయిరి. ఇప్పటికి దాసువారు ధారాళముగా ఆర్వేల వారని పిలుచుకొనిరి.

పై గంగరాజుగారికి ప్రథమ పుత్రుడు అక్కిరాజు. ఈతడు 1760 ప్రాంతమునకే యుక్తవయస్కుడైనట్లు తోచుచున్నది. ఏలయన ఈయన కాలములోనే అల్లూరు సోమేశ్వరస్వామి ప్రతిష్ఠ జరిగినది. ఇది శా. శ. 1682, 1760 క్రీ.శ. వెంకటరామయ్య శాఖలో జేరిన వాడగు జోగిరాజు అనునొక ఉపనీత్తుడైన చిన్న వానిని తన నైష్ఠకాచారములో సహాయుడుగా నుండుటకు తెచ్చుకొని మోహపుత్రునిగా స్వీకరించెను. దత్తుడుగాడు. కాని యీ జోగిరాజు వంశము అల్లూరులోనే యుండెను. ఈ జోగిరాజు తనకు భాగము రావలెనని ఒకప్పుడు జగడమాడినాడట. కాని లాభించ లేదు. అల్లూరులో మా యింటికి ఎదురుగా నున్న రావిచెట్లు ఈ జోగిరాజు గారు నాటినవని చెప్పుదురు. ఈయన భార్య వియ్యమ్మ. వీరికి పుత్రులు లేరు కాని పేరమ్మయను నొక కూతూరుండెను. ఈమె మా తాతగారి కంటె కొంచెము పెద్దది. ఈ పేరమ్మను నేనెఱుగుదును. 1887 సంవత్సరము మేయి నెలలో అల్లూరిలో చనిపోయినది. ఈ పేరమ్మను గురజాడ కాపురస్తులు గురుజాడ రామయ్యగారి కుమారుడు శ్రీనివాసులు గారికి వివాహము చేసిరి. ఈ శ్రీనివాసులు గారు అల్లూరులోనే యుండుచు 1881 సంవత్సరములో చనిపోయెను. ఈయనను నేను కొంచెముగా నెఱుగుదును. ఈ శ్రీనివాసులుగారి ముని మనుమడు శ్రీనివాసరావు ప్రస్తుతము అల్లూరి కరణము. ఈ వంశము క్లుప్తముగ ఈ పుస్తకము లోని చ అనుబంధమున జూపబడినది. అక్కిరాజుగారి సంబంధీకులని చెప్పు కొనదగు వారు ఈ గురజాడవారే వేరెవ్వరు కనిపించరు.

8. రఘునాయకులు

కమదనువారి దివాను అగ్రహార – యినాముల సంపాదన. పై గంగరాజుగారి కీయన ద్వితీయ కుమారుడు. ఈయనకు కన్నయ్య అను మరియొక పేరు కూడ కలదు. దాసు వంశములోని ప్రముఖులలో నీయనను చెప్పి తీరవలెను.

కేవలము లౌక్య వ్యవహార దురంధరుడు. ఈయన 1760 – 1792 వరకు గల కాలములో ప్రఖ్యాత పురుషుడై యుండెను. ఆ కాలములో కమదనవారు గురజలో నెలకొని యున్నారు. వారికీయన దివానుగా నుండెను. అప్పటి ప్రభువు కమదన శోభనాద్రి రాయణింగారైనట్లు మా నాయనగారు వ్రాసియుంచిన కాగితముల పొతక వలనను, దేవీ భాగవత పీఠిక వలనను తెలియును. గాని యీయన శోభనాద్రి రాయణం గారికి చార్మహలు రాకపూర్వమును నుండి యున్నట్లును చెప్పిన తప్పుగాదు. శోభనాద్రిరాయణంగారు కొన్ని కారణముల చేత కవుతరము కాపురస్తులయిన తాళ్లూరి జోగయ్యయను నొక నియోగి కిరాతుని దివానుగా నేర్పరచుకొనగా ఆ జోగయ్య పరగణాలలో ప్రజలను అతి బాధపెట్టి కర్కోటకుడుగా ప్రవర్తించినాడట. ఆ జోగయ్య క్రూరకృత్యముల సాగనీయక రఘునాయకులు నిరోధించి ప్రజానురంజకుడయ్యెనని చెప్పుటకు గర్వపడుచున్నాను. ఈ రఘనాయకులు బందరు నవాబుల యొద్దను పలుకుబడి కలిగియుండి కమదన వారి వ్యవహారములపై బందరులో కూడ నుండుచు వచ్చెను. ఈయనయే మాకుటుంబమునకు పూర్వమున్న అల్లూరు స్వాతంత్ర్యమును సంపాదించి, అల్లూరును సర్వాగ్రహారముగా చేసి, సీతనపల్లియను మరియొక అగ్రహారమును, కూరాడ, గుడ్లవల్లేరు, అంగలూరు, దొండపాడు, తమిరిశె, కామనపూడి గ్రామములలో సుమారు 200 ఎకరములు ఇనామును కమదన వారి వలన సంపాదించినారు. పైన వ్రాసిన అల్లూరి కరిణీకపు మిరాసిని, విన్నకోట వారు కోరగా వారికిచ్చి వేసెనట. కమదన వారిచే పలువురకు ఇనాము లిప్పించెనట. (చూ. కృ. డి. మ్యా. మరియు దే. భా. పీ.) ఆరువేల నియోగులు అగ్రహారికులుగా నుండుట చాల అరదు. ఈయన భార్య అచ్చమ్మ. ఈమె అడివివారి ఆడబడుచు, ఈయనకు పుత్రులు లేరు. వేంకటాపుర శాఖలో చేరిన గంగరాజును నొకని దత్తునిగా స్వీకరించెను, ఈయన విషయము దిగువను విశేషములలో వివరింపబడును.

9. బ్రహ్మయ్య. 12

పై గంగరాజునకు తృతీయ పుత్రుడు. ఇప్పుడు నిలిచియున్న దాసు వంశీకులందరు ఈయన సంతతివారే. ఈయన నా తాతగారికి తాత. ఈయన భార్య మంగమ్మ. తన యన్నలు జమీందారీ వ్యవహారములలోనే ఇతర పనులను నిర్వహించుచుండ తాను అల్లూరులోనే యుండి కుటుంబ వ్యవహారములు దిద్దుచుండినట్లు కనుబడును. ఈయన భార్య మంగమ్మ. 13.

10. గంగరాజు. 16

తనకును తన వారికిని గూడ కాకుండునట్లు కపట కృత్రిమ వ్యవహారములచే నాస్తిని కొంత చెడగొట్టిన మహాపురుషుడు. ఈయన పై రఘునాయకులు గారికి దత్తపుత్రుడు. జన్మతః వేంకటాపుర దాసువారి శాఖలోనివాడు. ఈయన కించిద్వ్యవహార వేత్త కాగానే బందురు ప్రవేశించెను. కోర్టు వ్యవహారములు కచేరీ వ్యవహారములకు బరిచితుడాయెను. అప్పటిలో బందరులో ప్రముఖులుగా నుండిన నెఱ నియోగ కుటుంబములలో అగ్రస్థానము వహించిన కవిపురపు వారి పిల్లను పెండ్లియాడెను. ఈయమ పేరు శేషమ్మ 17. ఈ గంగరాజు 1851, 1858 ? వరకు జీవించి యుండెను. మా నాయనగారు కొద్దిగా నెఱుగుదురట. అల్లూరులో నాకు బాగా యుక్తవయస్సు వరకు వృద్ధులుగా జీవించి యున్నవారును, గంగరాజుగారిని బాగుగా నెఱుగున్న వారును నాకీయన గాథలను చెప్పుచుండిరి. మా నాయనగారి తాతగారు కృష్ణయ్యగారు ఒక విధముగా వృద్ధులు గాకనే, అనగా సుమారు 40 సంవత్సరముల వయస్సుకు లోపలనే అనగా మా తాతగారికి 6 సంవత్సరముల వయసులోనే చనిపోయినారు. కృష్ణయ్యగారును ఈ గంగరాజు గారును ఒక తరములోనివారు. బహుశః యించు మించు సమ వయస్కులుగా కూడ నుండి యుందురు. గంగరాజుగారు బందరులో నుండి వ్యవహారపు గుంటచిక్కులు తెలిసినవాడు గావునను, కృష్ణయ్యగారు బహుశః చనిపోయి యుండుట వలనను, ఆస్తిలోని ముఖ్యాంశమయిన సీతనపల్లి యగ్రహారము తన పినతండ్రి వంశీకులకు చెందనీయక తానే మ్రింగవలెనను కపట భావముతో అప్పటిలో బందరులో కలంకారీ మొదలగు సరుకులలో వ్యాపారము చేయు ధనికులైన ఆదివెలమ కులస్థులగు పిళ్లారిసెట్టి అనువారి యొద్ద అప్పు తీసుకున్నట్లు కొంత తీసుకొని కొంత తీసుకొనకయో కల్పించి పత్రముపై నా తాతగారి అన్నగారు బ్రహ్మయ్య గారు కూడ చేవ్రాలు చేసినట్లు సృష్టించి ఋణమునకై సీతనపల్లి అగ్రహారమును వారికి తాకట్టు పెట్టినాడు. ఆ పత్రపు ఋణమునకు కొంత కాలమునకు పిళ్లారి సెట్టివారు దావా చేసి తామే విక్రయమును పొందినారు. ఇది 1830 సంవత్సరము ప్రాంతముననే జరిగినది. ఇది యిట్లుండగా గంగరాజు చేసిన మోసకృత్య ఫలితముగా అల్లూరు ఊరి దేవుడైన సోమేశ్వరునిదైనట్లు ఈస్టు యిండియా కంపెనీ వారు జప్తు చేసినారు. ఎట్టెటో గంగరాజు తన సగభాగమును రాబట్టుకొన్నాడు. మా తాతగారు చిన్నవారుగా నుండుటబట్టి రెండవ భాగమునకు దావా లేనందున, మా తాతగారు వ్యక్తులయిన వెంటనే తన పూర్వులు ప్రతిష్ఠించినట్టియు, ఆయన భక్తి నెలవైనట్టియు శ్రీ సోమేశ్వరస్వామి మీదనే దావా మున్నగు వ్యవహారములు జరిపి అప్పుడు జిల్లా శిరస్తదాయిన తాడికొండ శేషయ్యగారి అభిమానముచే కొంత కాలమునకు ముందే ఆస్తిని శేదీమీద స్వాధీనము చేసుకుని తుదకు 1856 సంవత్సరము 2000 రూపాయల మధ్య ఫలసాయముతో రాబట్టు కొనగలిగిరి. ఈ విషయమునే మా నాయనగారు **"మతిరహితులు కొందరు శత్రుత బూనిన కతన సోమరుద్రుడు మాకున్ ప్రతిభటుడై పోరియు సత్కృతుల నెఱిగి తాన యోడి గెలిపించె మమున్"** అని సరసముగా సభక్తికముగా దేవీ భాగవతములో వర్ణించినారు. ఈ జ్ఞాతి వలన మా తాతగారు బడిన యిడుములు పెక్కులు. ఈ గంగరాజుపోవు నాటికి కుటుంబరాయుడను నొక కొడుకు చిన్నవాడుండెను. ఈయన భార్య బందరు కవిపురపు వారి పడుచు త్రిపురమ్మ 21. మేనరికమే. ఈ కుటుంబరాయుడు తన భాగమునకు వచ్చిన ఆస్తినంతను విక్రయించుకొని దేశాంతరగతుడైనాడు. తుదకు కాకినాడలో పారుపల్లి పుండరీకాక్షునిగారి గృహమున 1875లో చనిపోయినట్లు తెలిసినది. ఈ కుటుంబరాయుడు గారి విక్రయము వలననే అల్లూరు అగ్రహారములోని మా సగభాగము గాక రెండవ భాగము పరుల స్వాధీనమగుట తటస్థించినది. కుటుంబరాయుడు ఏలూరిలోని మంత్రిప్రగడ జమీందారులని చెప్పబడు బ్రాహ్మణ జమీందారిణిలలో పేరెక్కిన శేషమ్మరావుగారికి సోదరుడైన అడివికొలను సూరయ్య గారికి తన భాగమును విక్రయించగా

ఈ భాగము అప్పటి లగాయతు 1927 వరకు అడివికొలను వారి స్వాధీనములో నుండినది. కాని అడివికొలను సూరయ్యగారి మనుమడగు సూర్యప్రకాశరావు పెదగొన్నూరు కాపురస్థులు కాజ లక్ష్మీనారాయణ చౌదరిగారికి విక్రయించినారు. తదాది యిప్పటి వరకు ఆ సగభాగము కాజ వారి కింద్ర నున్నది. కాజవారి విక్రయమునకు ముందే, అడివికొలను వారే అల్లూరులోని రయితులకు వారివలన ప్రతిఫలము తీసుకొని 1924 సంవత్సరములో వారి భాగపు భూములలో జిరాయితీ హక్కులను విక్రయించినారు. మా భాగస్థులకున్న భూములలో సర్వహక్కులు మా భాగస్థులవే. ఈ విషయము తరువాత కృష్ణయ్య, కన్నయ్య గార్ల చరిత్రలో చెప్పెదను. ఈ గంగరాజు 1780 ప్రాంతములో పుట్టి యుండనోపు. 1851లో 1858? మాయమాయెను.

11. కృష్ణయ్య. 18

ఈయన నా ముత్తాత. శరీర బలము గలవాడు. స్ఫురద్రూపియట. చిన్న వయస్సులోనే ముగ్గురు కుమాళ్లను ఇద్దరు కుమార్తెలను గన్న వెనుక సుమారు 40వ యేట 1822 సంవత్సరములోనే పోయెను. ఈయన భార్య పెదగొన్నూరు కాపురస్థులు అడవి మల్లయ్య గారి కుమార్తె వెంకమ్మ 19. ఈమె 1827 లో చనిపోయెను.

5. ఆధునిక చరిత్ర

(సుమారు 1800 మొదలు నేటి వరకు.) ఈ వంశపు ఆధునిక చరిత్ర చాలవరకు ప్రత్యక్ష అంశముల మీద ఆధారపడియున్నందున నిస్సంశయముగా వ్రాయగలుగుదును.

12. కృష్ణయ్యగారి కుమార్తెలు 1. మహలక్ష్మి. 2. వెంకమ్మ. వీరి సంగతి మొదట చెప్పి ఆయన పుత్రుల సంగతి తరువాత వ్రాసెదను. కృష్ణయ్యగారికి ఇద్దరు కుమార్తెలు. 1. మహలక్ష్మి ఈమె అల్లూరునకు సుమారు 3 మైళ్లదూరమున వాయువ్య మూలనున్న తామరకొల్లు గ్రామములో ఒక అడివివారి చిన్న వానికి వివాహము చేయబడెను. కాని యామె చిన్న తనములోనే పోయినది. సంతానము లేదు. ఆ కారణము వలననే ఇందలి వంశవృక్షాదులలో ఆమెకొక సంఖ్యనే నిచ్చి యుండలేదు. 2. వెంకమ్మ. ఈమెను కైకలూరులోని ఉప్పులూరి మల్లయ్యగారికిచ్చి వివాహము చేసిరి. వీరి కుటుంబము అప్పటి కాలస్థితులను బట్టి తక్కువ దశకు వచ్చుట తటస్థించినది. ఆయన యుండగా నాయన కొంతకాలము అల్లూరులోనే ఉండిపోవుచు వచ్చెనట. ఆయనకు పురుష, స్త్రీ సంతతి యుండెను. స్త్రీ సంతతి సంగతి ఇచ్చట వ్రాయుచుండుట లేదు. కాని కుమారులైన కనకయ్య, కృష్ణయ్యల సంగతి నీ దిగువ వ్రాయబోవు కన్నయ్యగారి చరిత్రలో చెప్పెదను. ఈ వంశమును చూపించు ఒక వంశవృక్షము క్లుప్తముగా 'చ' అనుబంధములో జూపబడినది. ఈ వెంకమ్మగారు 1853 లో చనిపోయినది. మల్లయ్యగారు పెద్దకుమారుని కనకయ్య గారి యుపనయనము మాత్రము 1885 రాక్షస సంవత్సరములో చేసినాడట. తరువాత దేశాంతరుడై 6 నెలల లోపలనే 1856 సుమారున చనిపోయినాడట.

13. బ్రహ్మయ్యగారు

ఈయన భార్య శేషమ్మ. లక్ష్మయ్య ఈయన కృష్ణయ్య గారి మొదటి కొడుకు. ఈయన ఎప్పుడు పుట్టినది సరిగా చెప్పనాధారము లేదు. కాని వీరు 1830 వరకు జీవించెను. వీరి విషయమై వ్రాయదగిన ఎక్కువ అంశములు లేవు. ఈయన కొఱ్ఱగుంటపాలెం కాపురస్థులును కరణమును అయిన అడని పెదవీరరాజుగారి కుమార్తె శేషమ్మను వివాహము చేసికొన్నారు. వీరికి సంతానము లేదు. బ్రహ్మయ్యగారు పోవు నాటికి శేషమ్మగారు చిన్నది. ఈమె మాతాతగారి మీద వ్యాజ్యము వేసి నెల 1కి 1 - ం - ం చొప్పున మనోవృత్తికి డిక్రీ పొందినదట. కాని తరుచు మా తాతగారి వద్ద ఉండుచు వచ్చెను. మా నాయనగారిని చిన్నప్పుడు ముద్దుగా పెంచినదట. ఈమె 1862 రుధిరోద్గారి సం॥ లో మా తాతగారి వద్దనే అల్లూరిలో చనిపోయినదట. ఈమె చవితి తల్లి కొడుకు అయిన అడివి వారి కుమార్తె అయిన గడ్డమణుగు జానకమ్మగారు అనగా ప్రస్తుతము బెజవాడలో ప్రాక్టీసు చేయుచున్న గడ్డమణుగు రాఘవరావు గారి తల్లి ఇప్పటికిని జీవించి యున్నది. కృష్ణయ్యగారి ముగ్గురు కుమారులలో కడవాడు

లక్ష్మయ్య. ఈయన ఉపనీతుడై అవివాహితుడుగా చిన్నతనములోనే పోయినాడు. కాబట్టి కృష్ణయ్యగారి కొడుకులలో మొదటి వానికి చివరవానికి సంతానము లేదు.

14. కన్నయ్య

కృష్ణయ్యగారి సంతానములో 2వ కుమారుడైన కన్నయ్యగారే ప్రముఖుడు. ఈయన గురించి వ్రాయుటకు అనేక విశేషములున్నవి. ఇప్పటికి నిలిచియున్న ఎక్కడనైన నుండినను దాసువారను వారు ఈ కన్నయ్యగారి సంతే. ఈ కన్నయ్య గారు 1816 థాత సంవత్సరములో అల్లూరునకు ఒక క్రోసు చూరమున నున్న పెదగొన్నూరులో మాతా మహుడైన అడివి మల్లయ్యగారి యింటిలో పుట్టినాడు. ఈయన తండ్రి ఈయన 6 సంవత్సరముల యీటివాడుగా నున్నప్పుడు 1822 సంవత్సరములో అల్లూరులోనే చనిపోయినారు. తల్లి వెంకమ్మ తరువాత 1827 సంవత్సరములో చనిపోయినది. తల్లిదండ్రులు పోవునప్పటికి చాలచిన్న వయస్సున నుండెను. ఇట్టి సమయములో తన పెదతాత కొడుకైన గంగరాజు బందరులో నీయన యెడల ఈర్ష్యాపరుడై వర్తించుచుండెను. కన్నయ్యగారి చిన్నతనములో కృష్ణయ్యగారి స్థితియు తగ్గుగా నుండెను. కాని కన్నయ్యగారిని పెంచిన మాతామహి అడివి వెంకమ్మ చాల జాగ్రత్త గలిగినదియు బుద్ధిశాలియు ధైర్యశాలియు నగుటచేత ఈయన ఏ భయమును లేక సాహస వంతుడై యౌదార్య వంతుడై వర్థిల్లెను. గంగరాజు గారెన్ని కుయుక్తులు పన్నినను ఎంత కపట వృత్తితో వ్యవహరించినను వానినన్నిటిని ధైర్యముతో నోర్చి కార్యదీక్షతో మెలగి సిద్ధ సంకల్పుడయ్యెను. ఈ గంగరాజుగారు కన్నయ్యగారి యెడల చేసిన యపకృత్యముల వర్ణన కొంత వరకు గంగరాజుగారి చరిత్రలోనైన వ్రాసియున్నాను. మరికొన్ని విషయములు సందర్భానుసరముగా ఈ దిగువ జెప్పెదను. తల్లిదండ్రులు పోవునాటికి అల్లూరులో నున్నను, తరువాత ఒకటి రెండు సంవత్సరములకే ఇండ్లు పరుశురామ ప్రీతి యగుట చేతను, పశువులు, నష్టమగుట చేతను, అల్లూరు అగ్రహారమును ఈస్టిండియా కంపెనీ వారు జప్తుచేయుట చేతను ఈయన అసహాయుడై పిన్న వయస్కుడై యుండు నవకాశము తీసికొని, పై గంగరాజు, ఆశాపరుడయి సీతనపల్లి యగ్రహారము తానే స్వాధీనము చేసికొని అనుభవించుట చేతను కొర్రగుంట పాలెంలో తన యమ్మమ్మ గారైన వెంకమ్మగారి తోడబుట్టిన వాడైన బోడపాటి రామయ్య కాపురముండుటను బట్టియు తన పెద్ద తాత యయిన రఘునాయకులుగారి మామగారి సంతతివాడైన అడివి చినగవర రాజుగారొకరు అభిమానులుండుట చేతను, తన అన్న బ్రహ్మయ్యగారి భార్య ఆ యూరియాడుబడుచగుట చేతను, ఆ కొర్రగుంట పాలెమునకు ఇంచుమించు తన 13వ యేట అప్పటి తన కుటుంబములో చేరి యున్న మాతామహి వెంకమ్మగారి తోడను, వదెనగారైన శేషమ్మగారి తోడను కోర్రగుంటపాలెమునకు పోయిన పై అడివి చినగవరరాజుగారింట ప్రవేశించిరి. అప్పుడు ఇనాముల మీద వచ్చుచుండిన అయివజు సుమారు 200 రూపాయిలతో ఒక విధముగా సౌఖ్యముగానే జీవనము గడుపుచుండెను. తరువాత మూడు సంవత్సరములకే నందన కఱవు అను మహోక్షామము 1832 – 33 లలో తటస్థించెను. అతరుణమున గురజ జమీందారులుగా నున్న కమదన పాపారాయణింగారి జమీలో బంధువు వాక్సహాయముచే కైలు నెల 1కి 4 – 0– 0 చొప్పున జీతముతో కైలు దారుగా కన్నయ్యగారుద్యోగమున ప్రవేశించిరి. ఈ పనిలో 4 సంవత్సరములు గడుపుచు తన వ్యవహారములు చక్కచేసి కొను ఆలోచనలు చేయు చుండిరి.

1837 సంవత్సరములో కన్నయ్యగారికి వివాహమాయెను. చిన్నవాడు తెలివితేటలు గలిగి సత్ప్రవర్తన గలిగి, ధైర్యౌదార్యములు కలిగిన వాడయినట్లు గ్రహించియు, పోయిన ఆస్తిని తిరిగి రాబట్టుకొన శక్తి సామర్థ్యములు గలవాడని యెంచియు, అప్పటికి ఉన్న కూరాడ గ్రామములోని వీరి ఈనామును వ్యవసాయము చేయుచున్నట్టి కూరాడ కాపురస్థుడు సద్గృహస్థుడు కూరాడ రామచంద్రయ్యగారు దగ్గు బాధ కలిగిన తన 5 సంవత్సరముల యీడు గలిగిన కుమార్తె కామమ్మ అను దానిని, ఈ కన్నయ్య గారికి ఈయదలచి యిచ్చి పెండ్లి చేసెను. రామచంద్రయ్య గారి ఆలోచనలు కోరికలు సఫలమయినవి. కన్నయ్య కామమ్మల సంసారము నిరుపమానమయిన దాయెను. సంతానము వర్థిల్లినది. ఆస్తి వచ్చినది. మహాయశో వంతుడైన కుమారుని గనిరి. కామమ్మగారు కాలుపెట్టిన నాట నుండియు మా తాతగారి కష్టములు తిరుగు మొగము పెట్టినవనియే చెప్పవచ్చును కామమ్మగారు

తన 13వ ఏటను అనగా 1844 – 45 సంవత్సరములో కొర్రగుంటపాలెమునకే కాపురమునకు వచ్చెను. 1846 లో వీరికి పుత్ర (మా నాయనగారు) జనన మాయెను. 1850–51 వరకు కొర్రగుంటపాలెములోనే యున్నారు. భార్య ప్రోత్సాహముచే అల్లూరు ప్రవేశించి తన వదెనగారైన అడివి వెంకమ్మగారి సంతానమైన నాగభూషణాదుల సహాయము తోడ అల్లూరులో వ్యవసాయమును సాగించుచు పాడి పంటలను వృద్ధిచేసికొనుచు రాగా 1856 వ సంవత్సరములో అల్లూరు తన భాగము 2000 రూపాయిలు మధ్య ఫలసాయములో స్వాధీనము చేసికున్నారు. అప్పటికి కూరాడ, గుడ్లవల్లేరు, మున్నగు గ్రామములలోని 100 యకరములు ఇనాములును అల్లూరు అగ్రహార అర్ధభాగమును వీరి యాస్తియై వీరి వలన నిరాక్షేపణగా యధాసుఖముగా అనుభవింపబడు చున్నది.1862 సంవత్సరము అల్లూరులో నిప్పుడున్న పెద్దయింటిని కట్టించిరి. ఈయన ఏక పుత్రుడైన మా నాయనగారు దినదినాభివృద్ధి నొందుచున్నారు. వీరి అభ్యుదయ విషయము శ్రీరాములుగారి చరిత్రలో వ్రాయనగును. పశుధనము మెండుగా వృద్ధి చేసినారు. 14 పాలేళ్లతో ముగ్గురు నలుగురు పశువుల కాపరులతో వ్యవసాయము సాగించుచు వచ్చిరి. తోటలు వృద్ధిచేసినారు. గ్రామములో రాజువలె, దయాదాక్షిణ్యములు గలిగి, ఉదారబుద్ధి గలిగి, వాసముచేసిరి. ఎట్టి కొదువయు వారికి లేదని చెప్పుట కేవలము సత్యము. ఈయన తన లౌక్య వ్యవహారములలో తరచు బందరు గుంటూరులకు బోవు చుండెడివాడు. అచ్చటి పెద్దల స్నేహభిమాన గౌరవములు సంపాదించ గలిగిరి. వీరు ప్రపంచజ్ఞానము విరివిగా గలిగిన వివేకులు. అన్నదాతలు. వీరికి వైద్యానుభవము కలిగి, బీదలకు సాదలకు ఉచితముగా మందుల నిచ్చుచుండెడి వారు. ఎంత ఎన్ని చూచినను వీరిలో దుర్గుణమును మొక దానినైనను నేను కనిపెట్ట జాలకున్నాను. వీరి ఔదార్య బుద్ధిని తెలియపరుచుటకు ఒక విధమైన వినోద అంశమును చెప్పెదను. వీరి జ్ఞాతి గంగరాజుగారో, కుటుంబరాయుడో, ఈయన మరణమును గోరి ఆయూరిలోనప్పుడే చేరిన ముక్కామల లక్ష్మినర్సు, గురజాడ శ్రీనివాసుల గారి సలహా సహాయములతో పొరుగూరైన బొమ్మినం పాటి గ్రామములో క్షుద్ర మాంత్రికుడైన జంగము చంద్రశేఖరుడను వానిచేత చేతపడి యను భూత వైద్యమును చేయించగా, సంగతి తెలిసియు అట్టి క్రియలు తన నేమియు చేయవను నమ్మకము గలవాడగుటచేసి వారిని ప్రతిఘటించక పోవుటయే గాక యధా గౌరముతోనే వారిని ఈయన చూచెనట. ఈ చంద్రశేఖరునికి ఇందుకై యొక యీనామీయబడినది. అది యిప్పటికి నున్నది. చంద్రశేఖరుని సమాధి ప్రస్తుతము ఉప్పుటేరు రోడ్డునకు తూర్పు భాగమున అల్లూరు బొమ్మినంపాడు సరిహద్దుల నున్న సమాధులలో నున్నది. ఈ క్షుద్రక్రియలో వారికి బోయిన రంగాయ ప్రస్తుతమున్న రాఘవులు, నరసిములు తాత సహాయపడినాడట. అసూయ స్పర్ధమున్నగు క్షుద్రగుణములు ఏకోశమున కన్నయ్యగారికి లేవు. బాహరీ సలహా, ఆజానుబాహు, విశాలముఖము, సుపుష్టి గలిగినవాడు.

పైన చెప్పిన ముక్కామల లక్ష్మీనరుసుగారి చరిత్ర యొకింత ఈ కన్నయ్య గారి కథలోనే యిమిడ్చి వ్రాయుట సమంజసము. ఈయన గంగరాజు గారికి ఒక విధమైన బంధువట. బొబ్బిలి, శనివారపు పేట సంస్థానములలో నుద్యోగము చేసెనట. అప్పటి కాలమున కనుగుణ్యమున కొంత ఇంగ్లీషు కూడ తెలిసినవాడట. బహుశః బంధుత్వరీత్యా గంగరాజుగారి ప్రోత్సాహముతో 1854 సంవత్సర ప్రాంతమున అల్లూరు ప్రవేశించినాడట. ఈయన జ్యోతిషాదిశాస్త్రములు తెలిసినవాడట. అల్లూరు ప్రవేశించునప్పటికే వృద్ధుడు. ఈయనయే ప్రస్తుతము అల్లూరులోనున్న ముక్కామలవారి యింటిని నిర్మాణము చేసినాడు. 1860 ప్రాంతముల అల్లూరులోనే చనిపోయినాడు. అప్పటికి మా నాయనగారికి (శ్రీరాములు) 14 సంవత్సరములుండును. లక్ష్మీనర్సుగారు మాతాతగారి యెడల లౌక్య వ్యవహారములలో విరోధిగా వర్తించినారు. మా నాయనగారి విద్యాబుద్ధి వేధ ప్రవర్తనాథి గుణములు వినయాది గుణములును గ్రహించిన వాడగుటచే మానాయనగారి యెడల ప్రేమతో ముద్దుతో ప్రవర్తించు చుండువాడట. అందువలన లక్ష్మీనరుసుగారు తాను చనిపోకముందు తన జ్యోతిష్యాది గ్రంధ సంపుటములను మా నాయనగారికి కాళ్లు కడిగి విధి పూర్వకముగా దానము చేసినాడట. ఈ విషయము మా నాయనగారు చెప్పగా నేను 3,4 మారులు విన్నాను. ఈ లక్ష్మీనరుసుగారికి విరివియైన ఇనాములు కొన్ని యుండెను. ఈయనకు సుబ్బారాయుడు గారను ఒక కుమార్డు, బాపమ్మ గుండుమెడ, రాజమ్మడుల్లా లను ఇద్దరు కుమార్తె లుండిరి. సుబ్బారాయుడు గారికి పాతూరివారి ఆడుబడుచు మంగమ్మగారు భార్య. ఈ సుబ్బారాయుడు మంగమ్మగార్లకు అన్నపూర్ణమ్మయను కుమార్తె యుండెను. గుండుమెడ బాపమ్మ బాల్యములోనే ముండమోసెను. డుల్లారాజమ్మగారికి

సీతారామయ్య నరసింహారావుగార్లను ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సీతారామయ్యకు పైన చెప్పిన అన్నపూర్ణమ్మను ఇచ్చి వివాహము చేసిరి. సీతారామయ్యకు సంతానము లేదు. తండ్రి పోయిన వెనుక గుండుమెడ బాపమ్మగారే తమ కుటుంబ కార్య వ్యవహారములు చక్కబెట్టుకొనుచు గుడివాడ కైకలూరు మున్నగు అధికార స్థానములకు పోయి తహస్సిల్దారు మొదలగు ఉద్యోగస్థుల ఆడంగులతో సహవాసము చేసి ప్రాపకము సంపాదించు కొనగలుగు చుండెడిది. ఇట్టి సంచారములలో నొకప్పుడు సుమారు 1877 – 78 ప్రాంతములలో గుడివాడకు పోయినప్పుడు ఆ యూరి కాపురస్తులు బొడ్డపాటి వెంకట్రామయ్య అనువారికి పూర్ణయ్య వెంకట్రామయ్యలను తల్లిదండ్రులను గోల్పోయిన ఇసువు లిద్దరుండిరి. తలిదండ్రులు పోగా విశాఖపట్నములో నున్న మేనత్త వచ్చి ఆ యిసువు లిద్దరిని తనతో విశాఖపట్నము తీసికొని పోవ ప్రయత్నించు చుండగా ఇద్దరిలో రెండవ వాడైన వెంకట్రామాయ్యను తన కిచ్చిన యెడల అపుత్రకయిన తన మేనకోడలు అన్నపూర్ణమ్మ పెంచుకొనునని యడుగగా మేనత్త ఒప్పుకొని బాపమ్మగారి కిచ్చినది. ఇట్లీ బాపమ్మగారు వెంకట్రామయ్యను కుఱ్ఱవానిని సుమారొకటి యొకటిన్నర సంవత్సరముఈటి వానిని అల్లూరు తెచ్చినది. తన మేనకోడలికి పెంపు అన్నది. తదాది వెంకట్రామయ్య అల్లూరు స్థిర వాసస్థుడాయెను. ఈ వెంకట్రామయ్యగారికి జన్మతః అన్నగారైన పూర్ణయ్యగారు టెలిగ్రాపు డిపార్టుమెంటులో వృద్ధికి వచ్చి టెలిగ్రాపు సూపరింటెండెంటుగా 700 రూపాయిల వరకు జీతము తీసి 1928 లో రిటైరై బెజవాడలో గృహనిర్మాణము చేసికొని సంతానముతో నిప్పుడు సుఖముగా నున్నారు. వెంకట్రామయ్యగారు పై చెప్పిన డుల్లా సీతారామయ్యగారికి కొడుకుగా వ్యవహరింపబడుచుండెను. ఈ వెంకట్రామయ్యగారు 1–1–1876 లో జన్మించిరి. ఈ వెంకట్రామయ్యగారే ప్రస్తుతము అల్లూరు అగ్రహారములో మా పనులు నిర్వర్తించుచున్న వెంకట్రామయ్యగారు. చాటపర్రు కాపురస్థులు కంభంమెట్టు లక్ష్మీపతిగారి కూతురు కలపర్తి సుబ్బమ్మగారి ద్వితీయ కుమార్తె సుబ్బమ్మను 1896 లో వివాహమాడెను. సంతానము లేకయే 1930 సంవత్సరం మే 29 తేదీన బెజవాడ ఆస్పత్రిలో ఆపరేషనులో చనిపోయినది. పై గంగరాజు చరిత్రలో చెప్పిన మొదటి అడ్వికొలను సూరయ్యగారి దత్తపుత్రుడు. సూరయ్య జన్మతః ఈ కంభంమెట్టు లక్ష్మీపతిగారి కుమారుడే. వెంకట్రామయ్యగారు నరసింహారావను వ్యావహారిక నామమును ధరించినాడు. అన్నపూర్ణమ్మగారు 1919లో చనిపోయినది. వెంకట్రామయ్య గారికి పినతండ్రి యయిన డుల్లా నరసింహారావు గారు పొన్నూరు మంగళగిరి బందరు మున్నగు ప్రదేశములలో తహస్సీలుదారి చేసి సుమారు 40 సంవత్సరము క్రిందట చనిపోయినారు. వీరిలో బాపమ్మ, రాజమ్మ, మంగమ్మ, అన్నపూర్ణమ్మ, నరసింహారావు, వెంకట్రామయ్య, సుబ్బమ్మగార్లను నేను స్వయముగా బాగుగా నెఱుగుదును.

కన్నయ్య కామమ్మగార్లు తమ కొడుకుతో పాటు మేనల్లుళ్లగు ఉప్పులూరి కనకయ్య, కృష్ణయ్యగార్లను పెంచి పెద్దవారిని చేసి వారి పెండ్లింళ్లు మున్నగు కార్యములు చేసిరి. కనకయ్య, కృష్ణయ్య గార్ల చరిత్ర దిగువ కామమ్మగారి చరిత్రలో చెప్పెదను. కన్నయ్యగారికి సుమారు తన 60వ సంవత్సరముల వయస్సులో పరిణామశూల యేర్పడి కొన్నాళ్లు బాధపడినారు, కాని నాకు జ్ఞానము తెలియు నాటికి అది వారిని అంతగా బాధించలేదని నా యభిప్రాయము. ఈయన అవసాన దశలో చివర రెండు సంవత్సరములు మతిభ్రమణ కలిగి అట్లేయుండి 1880 సం।రం మార్చి తేదికి సరియగు విరోధి సంవత్సరం ఫా.బ. నాడు తన 73 వ సంవత్సరమున కాలధర్మము నొందిరి.

కన్నయ్యగారి జీవితకాలములో దేశములో కొన్ని విశేషములు జరిగెను. 1833 లో నందన కఱువు . 1837 లో క్వీన్ విక్టోరియా సింహాసనాధిష్ఠానము. 1857 లో గ్రేటు ఇండియన్ మ్యూటినీ. 1864 బందరులో ఉప్పెన. 1854 గోదావరి యానకట్టను 1864 లో కృష్ణ కాల్వలు త్రవ్వుట. 1876 –77 లో కఱువు.

15. కామమ్మ

ఈమె కన్నయ్య గారి భార్య. ఈమె 1832 సంవత్సరంలో గుడివాడ తాలూకా కూరాడ గ్రామమున జన్మించినది. ఈమె తండ్రి కూరాడ రామచంద్రయ్య గారు. తల్లి నరసమ్మగారు (చూ. అ. గ.) ఈమెకు ముప్పురు అక్కలును ఇద్దరు అన్నలు ముప్పురు

తమ్ములు నుండిరి. ఈమె చిన్ననాటి నుండియు ఉబ్బసపు దగ్గుతో బాధపడు చుండెడిది. అందుకై తండ్రి నల్లమందు ఈమెను అభ్యాసము చేసినాడు. నల్లమందు తుద వరకు తినుచుండెడిది. ఆ దగ్గు రానురాను తగ్గినను నాకు బాగుగా వ్యక్తి కలిగిన నాటికి కూడ ఉండెను. మా తాతగారికి చెందిన కురాడలోని ఇనామును ఈ రామచంద్రయ్యగారు నేవ్యము చేయుచుండిరి. ఆసందర్భమును బట్టియు రామచంద్రయ్యగారి మరియొక కుమార్తె అయిన వెంకమ్మగారు అప్పటికి మా తాతగారు నివసించుచుండిన కొర్రగుంట పాలెంలో అడివి వెంకటరాయుడు గారి భార్యయయిన సందర్భమును బట్టియు, రామచంద్రయ్యగారు కన్నయ్యగారిని బాగుగా నెఱిగి యుండి ఆయన గుణమును తెలివితేటలు కనిపెట్టిన వాడగుట చేత కన్నయ్య గారికి తన కుమార్తెనిచ్చి వివాహము చేయ నిశ్చయించి అప్పటికి 5 సంవత్సరముల ఈడు గలిగిన కామమ్మ నిచ్చి 1837 సంవత్సరములో వివాహము చేసిరి – ఈ సంవత్సరముననే క్వీన్ విక్టోరియా సింహాసన మధిష్ఠించెను – ఈమె తన 13వ సంవత్సరముననే కాపురమునకు వచ్చెను. 1846 ఏప్రియలు 8వ తేదీన మా నాయన గారైన శ్రీరాములుగారిని కనెను. ఈయనయే ఆమెకు సంతానము. ఇతర కొమాళ్లుగాని కూతుళ్లుగాని ఆమెకు పుట్టనేలేదు. సత్సంతానమును గనిన అదృష్టవంతురాలు. ఈయమ్మకు కష్టము లెన్నడును లేవు. ఈమె జీవితమంతయు సౌఖ్య పరంపరతో కడచెను. రాణివలె గృహమును ఊరును పాలించినది. అన్నదానము విరివిగా చేసిన దాత. కనుకనే మా నాయనగారు తమ దేవీ భాగవత పీఠికలోని మాతృస్మరణలో “కన్నయ్య పండింప, కామమ్మ వడ్డింప లేచిన విస్తళ్లు లెక్కలేవు,” అని భక్తి పూర్వముగా గర్వపడి వ్రాసినారు. ఈ సీన పద్య రచనములోని యర్థము యధార్థము. కించిత్తు కూడ అతిశయోక్తి లేదు. ఈమె పెట్టిన అన్నమున కైన బియ్యము కొలత వేసిన కొన్ని పుట్లగును. కోపము వచ్చినప్పుడు నల్లమందు మహత్తుచేత కొన్ని కేకలేసినను సర్వసామాన్యముగా దయయే కనుబర్చునది. ఊరిలోని వారికి నెన్నడు అన్నము లేకుండ నుండ నీయలేదు. నా చిన్నతనములో కూడ ఈ కుటుంబమునకు 200 వరకు పశుగణముండినది. ఆవులు, గేదెలు, వీని లేగలు, కోడెలు, పోతులు, ఎద్దులు విస్తారముగా నుండెడివి. పాడియతి సవృద్ధి. బానలతో పెరుగును మజ్జిగ చేసి వెన్నయెత్తి ప్రతిదినము ఆమె నేయి కాచుట నేనెఱుగుదును. కార్యభారములలో పెనిమిటి సహాయ వర్తినిగా నుండెడిది.

కామమ్మగారి బోలిన అదృష్టవంతురాలు లేదని చెప్పుటలో కించిత్తు సంశయము గూడ లేదని గట్టిగా చెప్పవచ్చును. పాడిపంట పలుకుబడులు గలిగి దానము ధర్మములు గలిగి సత్సంతానము గని మనుమలు మనుమరాండ్రు ముని మనుమరాండ్రను నెత్తి బంధు పోషణ చేసి విరివిగా తన చేతుల మీద తనమాటమీద శుభకార్యాదులనుజేసి ఎక్కువ అయిన అయిదువను అనుభవించి దుఃఖమనుదాని నెఱుగక కొడుకు వద్ద ఏలూరులో 1894 సంవత్సరం మాఖ బహుళ 13 శివరాత్రినాడు కాలము చేసినది.

ఈమె తమ కొడుకుతో బాటు తమ ఆడుబడుచైన ఉప్పలూరి వెంకమ్మగారి కుమార్తె కొమాళ్లయిన కనకయ్య కృష్ణయ్యగార్లను కన్నయ్య కామమ్మగారు పెంచినారు. వీరి సంతతిగూడ మనుమలతోబాటు పెంచినారు. కనకయ్యగారి జననము 1840 కృష్ణయ్యగారి జననము 1843. కృష్ణయ్యగారి యుపనయనము, తండ్రిపోయిన వెనుక 1856 లో మా తాతగారే జరిపిరి. మా నాయనగారి యుపనయనము కూడ ఇదే సంవత్సరంలో జరిగెను. కనకయ్యగారికి 1859 సంవత్సరం ఫాల్గుణ మాసములో బందరు కాపురస్థులు నండూరి లక్ష్మీకాంతము గారి ద్వితీయ కుమార్తె కమలాదేవినిచ్చి బందరులో వివాహము చేసిరి. ఈ లక్ష్మీకాంతముగారిని కమలాదేవి గారిని నేనెఱుగుదును. కమలాదేవిగారు 1887 సంవత్సరం జూన్ నెలలో సర్వజిత్ సంవత్సరం జ్యేష్ఠ బహుళ 6వ దినమున బందరులో చనిపోయినది. కృష్టయ్యగారి వివాహము ముదురు వయస్సులో అనగా సుమారు 1874 సం॥న జరిగెను. ఈయనకు కొర్రగుంటపాలెం కాపురస్థులు అడివి లక్ష్మయ్య – బుచ్చెమ్మగార్ల కుమార్తె శరభమ్మగారి నిచ్చిరి. ఈమె సంతానములో గొందరుగూడ అల్లూరులో మా యింటినే పుట్టిరి. సుమారు 1880 సం॥లో ఏ కారణము వలననో కనకయ్య కృష్ణయ్యగారలు తమతమ అత్తవారిండ్లైన బందరు కొర్రగుంటపాలెములకు బోయిరి. ఈ శరభమ్మగారి తోడ బుట్టిన అడివి శివరామయ్య గారను ఒక ప్రముఖులు ఇప్పటికి కొర్రగుంటపాలెములో సుఖమైనట్టియు గౌరవమైనట్టి జీవనము చేయుచున్నారు. కనకయ్య గారు తిరిగి 1888 సం॥లో – భార్య పోయినందు వలనని తోచును – అల్లూరునకు ప్రవేశించి మా వ్యవసాయాది పనులలో

సహాయము చేయుచు వచ్చి తన ప్రథమ కుమారుడైన మల్లికార్జునరావు గుడివాడలో ప్లీడరుగా ప్రవేశించిన మీదట 1896 లో గుడివాడకు బోయి కుమారుని వద్దనే 1900 సం॥ ఫాల్గుణ శుద్ధ 15 నాడు కాలము చేసిరి. కృష్ణయ్యగారు కార్రగుంటపాలెములో 1889 సం॥ననే చనిపోయిరి. శరభమ్మగారు తన కుమారుడు నరసింహారావుగారు నందిగామలో పోలీసు సబుఇన్‌స్పెక్టరు పనిలో నుండగా అక్కడనే 1928 లో మార్చి 6వ తేదీన చనిపోయినది. కనకయ్య కృష్ణయ్య గార్ల సంతాన విషయము దిగువన శ్రీరాములు – జానకమ్మ – వీరి కుమాళ్ల చరిత్రలలో నిమిడ్చి వ్రాయుట భావ్యము కనుక ఆపట్టుననే వ్రాసెదను.

16. శ్రీరాములు (నా తండ్రి)

ఈ పురుషుడు మా వంశములో వహించియున్న ప్రాముఖ్యతను బట్టి, వీరి చరిత్ర కొంత విపులముగా వ్రాయదలచి వ్రాయుచున్నాను. ఈయన పై కన్నయ్య కామమ్మగార్లకు ఏక సంతానము. 1846–1908 వరకు 62 సంవత్సరము జీవించిన మహాపురుషుడు. ఈయన 1846 సంవత్సరము ఏప్రియలు 8వ తేదీకి సరియగు పరాభవ నామ సంవత్సన చైత్ర శుద్ధ 12 సాయంకాలము వేళలో కురాడ గ్రామములో తన మాతామహుడగు కూరాడ రామచంద్రయ్యగారి యింట బుట్టెను. ఈయన పుట్టునాటికి మా తాతగారు కుటుంబముతో కొర్రగుంటపాలెములోనే యుండిరి. వీరికి చవులము కొర్రగుంట పాలెములోనే జరిగినది. తల్లిదండ్రులు అల్లూరు ప్రవేశించిన సంవత్సరములోనే అక్షరాభ్యాసమయి 6 నెలలు మాత్రము కొర్రగుంటపాలెము కాపురస్థులు అడివి సుబ్బారాయుడుగారి వద్దనే చిన్న చదువు చదువుచు వచ్చిరి. తరువాత గుడ్లవల్లేటి కాపురస్థులు గుడ్లవల్లేటి వేదరాజుగారి యొద్ద కొన్నాళ్లు చదివినారు. ఇప్పటికి బాలరామాయణము అమరసింహములో కొంత వరకు మాత్రము చదువగలిగిన తరువాత గురుముఖతః యే విద్యను అభ్యసించలేదు గాని తండ్రిగారి వద్దనే లెక్కలు వేయుట వ్రాత వ్రాయుట భారతాది గ్రంధముల జదువుటయు నభ్యసించిరి. వీరి తండ్రిగారు పండితులుగా కున్నను శ్రుత పాండిత్యము బాగుగా గలిగినవారు. కాని శ్రీరాములుగారు స్వభావ సిద్ధముగా తెలివి గలవారును, మేధాశక్తి గలిగిన వారును గావున ఆంధ్రము కొంత వరకు స్వయంసహాయము వలననే చదువుచు వచ్చిరి. ఇట్లు వీరికి 12వ సంవత్సరము వచ్చినది. 1858 వ సంవత్సర నళ నామ సంవత్సరములో ఈయనకును, వీరి మేనత్త కుమారుడైన ఉప్పులూరి కృష్ణయ్యగారికిని ఉపనయనములు జరిగినవి. ఉపనీతుడైన కొన్ని దినములలోనే మా తాతగారి మేనత్త కుమారుడైన ఉప్పులూరి కృష్ణయ్యగారికిని ఉపనయనములు జరిగినవి. ఉపనీతుడైన కొన్ని దినములలోనే మా తాతగారి మేనత్త కుమారుడు అడివి వేంకటశివుడు గారు బందరులో నున్న అవకాశము తీసికొని శ్రీరాములుగారిని తండ్రిగారు బందరునకు ఆంగ్లేయ విద్యాభ్యాసము నిమిత్తము పంపిరి. అప్పటికి సుమారు 14 ఏండ్ల క్రిందట అనగా 1843 సంవత్సరము నోబిల్ అను నొక క్రైస్తవ మత వ్యాపకుడు ఒక పాఠశాలను ప్రతిష్ఠించెను. ఆయన ఆ పాఠశాలలో కొందరు హిందూ బాలురకు కూడ క్రైస్తవ బాలురతోబాటు విద్య చెప్పుట ప్రారంభించినారు. ఇప్పుడే మన ప్రాంతముల యాంగ్లేయ విధానమున విద్యను బోధించుట మొదలిడినది. శ్రీరాములుగారు బందరులో నోబిలు పాఠశాలలో విద్యార్థిగా నున్నప్పుడు హిందువుల బాలురను క్రైస్తవ మత వ్యాపకులు క్రైస్తవ మతములో కలుపుచుండుట తటస్థించినది. ఇట్టి సమయములో క్రైస్తవ మత స్వీకారమును చేసిన వారిలో కీ.శే. చేవెండ్ర వేంకటాచలము పంతులుగా రొకరు. శ్రీరాములుగారు విద్యార్థిగా నున్న కాలములో వీరి తెలివిని బుద్ధిని గుణమును చక్కగా గ్రహించి క్రైస్తవమత వ్యాపకులు ఈయనను దయతో ప్రేమతో చూచుచు వచ్చిరి. ఇంతలో బందరులో క్రైస్తవమత వ్యాపకమును తల్లిదండ్రులు గ్రహించి తమ కుమారుడును చిన్నతనముచే క్రైస్తవమత స్వీకరణము చేయునేమోయను భీతిచెంది కుమారునకట్టి యే చింతయు లేనప్పటికి, కుమారుని పెత్తల్లి కుమారుడైన అడివి నాగభూషణము గారిని బందరున కంపి తిరిగి అల్లూరునకు రప్పించుకొనిరి. ఇంతటితో శ్రీరాములుగారి బస్తీ ఇంగ్లీషు చదువు తుదముట్టినది. తల్లితండ్రులకు ఒక్క కొడుకు, పాడిపంటలు బాగుగా నున్నవి. మంచి నివాసయోగ్యమైన గ్రామము; తోటలు; దొడ్లు; ఆటలకు వీలయిన విశాల ప్రదేశములు, అవకాశము; తోడునకు మేనత్త కుమాళ్లు. 'బలమును నింటిలో జరుగుబాటును .....' ఇన్ని గలిగి ఒక ప్రక్కను తన బాల్యక్రీడా వినోదముల స్వేచ్ఛగా జరుపుచు ఇంకొక ప్రక్క స్వయం సహాయముతో

సంస్కృతాంధ్రముల నభ్యసించుచుండెను. ఈయన తన బాల్యావస్థను ఎట్లు జరిపినది వీరి దేవీ భాగవత పీఠికలోని అల్లూరు గ్రామ వర్ణనను తన బాల్యక్రీడాది విశేషములను చదివిన కన్నులకు గట్టినట్లు తెలియగలదు. ఈయన బందరులో నున్నపుడు కవిత్వ బీజము లంకురించినవి. **జయజయ సోమలింగ** అను కీర్తన అప్పుడల్లినాడట. 14వ యేట **సాత్రాజితి విలాసమను** నొక గ్రంథమును యక్షగాన పద్ధతిని రచించిరి. ఇది చిన్ననాడు చేసిన దయినప్పటికి ఇందలి కవిత్వము చాల రసవంతమై ప్రౌఢమయి యున్నది. ఇట్లు తన విద్యాభివృద్ధి జరుగుచున్న సమయమున, కాళయుక్తి 1859 సంవత్సర మాఘమాసమున భయంకరమైన జ్వరమువల్ల పీడింపబడెను. దైవకృపచే నాగండము తప్పించుకొనెను. అదే కాళయుక్తి సంవత్సర ఫాల్గుణ బహుళ సప్తమినాడు 1859 మార్చి 25 వీరి వివాహము జరిగినది. తన పెద్ద మేనమామగారగు కూరాడ లక్ష్మీనరసింహము గారి ద్వితీయ పుత్రిక జానకమ్మ కాంతమ్మ నిచ్చి కూరాడలో వివాహము చేసిరి. అప్పుడే లక్ష్మీనరసింహము గారి ప్రథమ పుత్రిక యగు శేషమ్మగారిని వీరి పెత్తల్లి వెంకమ్మగారి ప్రథమ పుత్రుడు అడివి నాగభూషణము గారికిచ్చి వివాహము చేసిరి. అంతకు ముందే 8 దినములనాడు వీరి మేనత్తగారి పెద్దకుమారుడగు కనకయ్యగారికి వివాహమాయెను. 1860 సిద్ధార్థిలో వీరి మాతామహుడు రామచంద్రయ్యగారు చనిపోయినారు. ఇట్లు విద్యాభ్యాసంగము తోడను బాల్యక్రీడా వినోదములతోనుండుచు విద్యాతురత గలిగి 1865 సంవత్సర ఏప్రియలులో తల్లితండ్రులకుగాని మరెవ్వరికిగాని తెయజేయకనే యర్ధరాత్రమున నిల్లువెడలి సంస్కృత వ్యాకరణాదుల నభ్యసింప, ఆకిరిపల్లి పలాయనులైరి. ఈ ఆకిరిపల్లి నూజివీడు సంస్థానములోనిది. నూజివీటి ప్రభువైన అప్పారాయణింగారలకు అభిమాన దైవమైన శ్రీ శోభనాద్రి స్వామికి నిలయమైన గ్రామమై యున్నది. అప్పటికి శోభనాద్రి అప్పారాయణింగారను మహాప్రభువు అఖండ నూజివీటి సంస్థానము నేలుచుండెను. ఈయన విద్యాభిలాషి. విద్యాపోషకుడు. సరసుడు. ఈ శోభనాద్రి అప్పారాయణిం గారు 1868లో చనిపోయినారు. అప్పటి యాకిరిపల్లి స్థితి సామన్యము గాదు. విద్యాపీఠము. మహా విద్వాంసుల కాటపట్టు. గరికిపాటివారు, దేవులపల్లివారు, సూరివారు మున్నగు తెలగాణ్యశాఖా ప్రముఖుల విద్యాగురువులు. కడుదూరము నుండి విద్యార్థులు వచ్చి జమీందారుల ఔదార్యముచే నిక్కడ వేదశాస్త్రాదుల నభ్యసించినారు. ఇప్పటికిని ఆకిరిపల్లి కస్తూరి కట్టిన గుడ్డయే. ఇప్పటికిని నిక్కడ నొక సంస్కృత పాఠశాల నడుచుచునే యున్నది. కాని చాలవ్యత్యాసమున్నది. విద్యా వినోదములతో చెన్నారు చుండిన అప్పటి ఆకిరిపల్లి వ్యాజ్యాభూత తాండవములతో నిప్పుడు క్రాగుచున్నది. నిరాడంబరముగా విద్యాగోష్ఠులతో ప్రకాశించిన ఆకిరిపల్లి యిప్పుడు మోసాడంబరములతో అజ్ఞానాంధకారమున తడవుకొనుచున్నది. అట్టి అప్పటి ఆకిరిపల్లిలో ఒక 10మాసములు మాత్రము శ్రీరాములుగారుండి సంస్కృత వ్యాకరణము నేర్చినారు. వ్యాకరణశాస్త్రము ప్రధానముగా నేర్చినారను మాటయే గాని ఇతర శాస్త్రములలోను సాహిత్యములోను విస్తార పరిచయము పండిత సంపర్కము వల్లను తోడి విద్యార్థుల సంపర్కము వల్లను శ్రీరాములుగారు కలిగించుకొని యున్నారు. ఈ ఆకిరిపల్లి 10 మాసముల జీవనము, విద్యార్థిత్వము వారి విద్యాభివృద్ధికి చాల తోడ్పడి యుండు. గరికిపాటి అప్పయ్యశాస్త్రిగారు, లక్ష్మణ శాస్త్రిగారు, జోగశాస్త్రిగారు మున్నగు వారు శ్రీరాములుగారి అప్పటి సహాధ్యాయులో ఉపాధ్యాయులో యని శ్రీరాములుగారు చెప్పగా నేను చాలసారులు విన్నాను. శ్రీరాములుగారి విద్యార్థి దశలో ఆకిరిపల్లి ప్రయాణము ముఖ్యముగా నెన్నదగినదే. ఆకిరిపల్లిలో నుండగా దినమునకు 0-8-0 వంతు విద్యార్థి వేతనము జమీందారుగారి వలన శ్రీరాములుగారు పొందిరి. ఆకిరిపల్లిలో 10 మాసములు కడిపి సుమారు ఆసంవత్సర మార్గశిర మాసమునకు అల్లూరునకు తిరిగి వచ్చినారు. వచ్చిన కొలది దినములకే సుమారు మాఘమాసములో భార్య జానకమ్మ కాపురమునకు వచ్చెను. సంస్కృత విద్యను దినదినము అభివృద్ధినొందించు కొని యుండిరి. **వ్యక్తాక్షరీ** ప్రజ్ఞలు నలవరుచుకొని యప్పుడే నూజివీటి సంస్థానములోను వల్లూరు సంస్థానములోను వానిలో జయప్రదముగా పరీక్షలనీయ గలిగిరి. అప్పటిలో నూజివీటిలో మాడభూషి వేంకటాచార్యులుగారు, పెంటపాడు కాపురస్థులు 'భరతాభ్యుదయ' కృతికర్త సంస్కృతాంధ్రములలో కూలంకష ప్రజ్ఞావంతుడు ఉండెనట. ఈ వేంకటాచార్యులుగారు ఏకసంతగ్రాహియట. అసమయమున వేంకటాచార్యులు గారు శ్రీరాములుగారు నుగ్గడించుచు **"పన్నెండేడులనాడె కవిత సెప్ప ...."** పద్యమును చెప్పిరి. ఈ వేంకటాచార్యులుగారు ఏలూరులో మా యింటికి నా చిన్నతనములో వచ్చి మా నాయనగారితో ప్రసంగించుట నాకు స్వయముగా తెలియును. 1887 సంవత్సరములో

జరిగిన విక్టోరియా రాణిగారి గోల్డెన్ జూబిలీ సమయములో ఉభయులు వ్రాసిన ప్రశంసా పద్యములను ఒకరితో నొకరు చెప్పుకొని వాని వాని గుణముల స్నేహభావముతో పోల్చుకొని ఒకరితో నొకరు ప్రశంసించుకొనుట నేను విన్నదే. ఇక వల్లూరులో దీనికే తోట్లవల్లూరని పేరు. ఇది బెజవాడ తాలూకాలో కృష్ణాతీరమున నున్నది. శ్రీరాములుగారు పరీక్షనిచ్చిన సమయములో బొమ్మదేవర నాగన్న నాయుడు బహద్దరుగారు జమిందారు. ఉదారులు. విద్యాపోషకులు. తెలగ కులస్థులు. అప్పటిలో మతుకుమిల్లి నరసింహశాస్త్రులుగారను నొక నియోగి పండితుడు ఈ యాస్థాన పండితుడుగా నుండెను. ఈ సంస్థానమునకు నాగన్న నాయుడుగారి తదనంతరము పాలనకు వచ్చిన ఆయన కుమారుడు వెంకట నరసింహనాయుడు బహద్దరుగారు మంచి తెలివి గలవాడు. పరిపాలనా సమర్థుడు. మృగములచే క్రీడలు సలిపించెడి వాడు. యంత్రనిర్మాణ ప్రజ్ఞాధురీణుడు. స్వయముగా భీమడోలు నుండి తన నివాస గ్రామమైన పంగిడి గూడెమునకు రైల్వే రోడ్డు నాలుగు మైళ్లు నిర్మించి పొగబండిని నడపినవాడు. దర్పము గలవాడు! వ్యాఖ్యాప్రియుడు. సాహసవంతుడు. ధైర్యవంతుడు. తరువాత శ్రీరాములుగారే గాక శ్రీరాములు గారి కుమారులమైన మాధవరావుగారు, గోవిందరావుగారు, నేను, మధుసూదనరావుగారులు ప్లీడరీ చేయునప్పుడు ఈ నరసింహనాయుడు గారికి ప్లీడరులుగా నుంటిమి. వీరి కాలములోనే సంస్థానము ఛిన్నమై ఇప్పటికి ముక్కలైకొన్ని భాగములు పరాధీనములగుట కూడ తటస్థించినది. ఒకప్పుడు వీరి వల్లూరు సముతులో వ్యావసాయకుల వివాదము 1878 ప్రాంతమున ప్రబలినది. ధైర్యముతో అధికారులతో ఢీకొనిరి. అప్పుడు బెజవాడలో డిస్ట్రిక్టు మునసఫ్ చేయుచుండిన కీ.శే. మున్నంగి రామయ్యగారు వీరి సంస్థానమునకు మేనేజరుగా నేర్పడి ఈ వివాదాలను సమయించిరి.

ఇప్పటికి ఒక విధముగా వీరి విద్యార్థి దశ అయినదనే చెప్పవచ్చును. కాని వారి జీవితకాలమంతయు క్రొత్త విషయములను గ్రహించుచునే యుండుటచేత ఆయన యావజ్జీవ విద్యార్థి యనియే చెప్పవచ్చును. జ్ఞాన సంపాదన తృష్ణ వారికెప్పుడు తీరలేదు.

1867 సంవత్సర ప్రభవ సంవత్సరము భాద్రపద మాసములో వీరికి ప్రథమ పుత్రుడు కేశవరావుగారు ప్రభవమైరి. 1869 – 70 సంవత్సర శుక్ల సంవత్సరములో నీయనకు ద్వితీయ పుత్రుడు నారాయణరావు గారు జన్మించెను. 1871 ప్రజోత్పత్తిలో మాధవరావుగారను మూడవ కుమారుడు కలిగెను. ఈయన పుట్టిన నాటనుండియే శ్రీరాములుగారు ప్రపంచ వృత్తుల ప్రవేశించినారు. 1871,72 సంవత్సరములలో పుల్లరి యిజారాలనుజేసి నష్టపడినారు. ఈ మహా వ్యక్తికి అల్లూరు కడుచిన్నదై యుండి యుండి, తన విద్యాభివృద్ధికిని, తన పాండిత్య ప్రకర్షకును, తన యాశయముల పరిపూర్ణత నొందించుటకు చాలనిదని యెంచి యశోవృద్ధిని గోరి యల్లూరు విడిచిన గాని యివి సంభవిల్లవని బాగుగా గుర్తెరిగి, అల్లూరు విడుచుటయే మంచిదని లోలోన భావించు చుండిరి. ఇదే సమయములో పంగనామముల బాలకృష్ణయ్యగారను కైకలూరు డిప్యూటీ తహశ్శిలుదారు మున్నగు కొందరుద్యోగస్థుల ప్రోత్సాహముచే అప్పటికి అల్లూరు గ్రామమునకు తాలూకా గ్రామమైన గుడివాడలో ఇంగ్లీషు పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయుడుగా వెడలిరి. తల్లిదండ్రులకు ఈయన ఏకైక పుత్రుడైనను, పుత్రుని యాశములకు విరోధముగా నడుచుట మంచిది గాదని యెంచి పుత్రుని అభ్యుదయమే యెక్కువగా తలచి, పుత్రుడు తమను వీడిపోవుటకు అభ్యంతరము కలుగజేయ లేదు. ఇదియే మా వంశము అల్లూరు విడుచుటకు ప్రాతిపదికము.

కాలాంతరమున ఆంధ్రులలో కీర్తి, ప్రముఖత సంపాదించిన – గుడివాడ తాలూకా చెన్నూరు కాపురస్థులు రెంటాల వెంకట సుబ్బారావు పంతులు, బి.యె., బి.యల్. గారు – శ్రీరాములుగారు గుడివాడలో నుపాధ్యాయులుగానున్న కాలములో వారికి శిష్యుడు. ఇంగ్లీషు నభ్యసించు చుండెను. శ్రీరాములుగారు తాను చిన్ననాడు బందరులో నోబిల్ పాఠశాలలో నేర్చుకున్న స్వల్పాంగ్లేయ భాషను మరచినది మరవగా మిగిలిన దానిని పునః అభివృద్ధి చేయసాగిరి. పై రెంటాల వెంకట సుబ్బారావుగారు మున్నగు వారు నేర్చుకొన్న యింగ్లీషును శ్రీరాములుగారు వారి వలన నింటి వద్ద నేర్చుకొన సాగిరి. శ్రీరాములు గారి యింగ్లీషు భాషాభ్యసన ప్రారంభమిప్పుడేయని చెప్పవలెను. మేధావి, గ్రహణశక్తి గలవాడు గనుక త్వరలో నందుకొని పోవువాడు. ఇట్లు 1872 – 73 లలోను, 74 లో కొంతకూడ గుడివాడలో నుండి తరువాత అదే తాలూకాలో బందరునకు 11 మైళ్ల దూరముననున్న

కవుతరమునకు ఆ గ్రామస్తుల కోరిక మీద ఉపాధ్యాయవృత్తి మీదనే వెళ్లిరి. అచ్చట నొక సంవత్సరము రమారమి యుండిరి. అప్పుడే భావ సంవత్సరము (1874) లో నాల్గవ కుమారుడు గోవిందరావు గారి జననము. ఇదే కాలములో శ్రీరాములు గారు 'వేదాచల మహత్మ్యము', 'కృష్ణార్జున సమరము' అను రెండు ప్రౌఢ ప్రబంధముల వ్రాసిరి. అందలి పద్యములు నాకు యుక్తవయస్సు వచ్చువరకు అప్పుడప్పుడు మానాయనగారు చదువుచు వచ్చెడివారు. వాని వ్రాత ప్రతులను గూడ నేను చూచుచుండెడివాడను. ప్రథమ కావ్యములగుటచేత నవి సంస్కృత సమాస భూయిష్ఠముగాను, పూర్వ సాంప్రదాయానుసారముగాను నుండె. ఆ గంథ్రము లిప్పుడు గానరావు. శ్రీరాములుగారు పండిత గోష్ఠితో కాలము గడుపువారు. ఎవరి దగ్గరనే గొప్ప యున్నను, దానిని గ్రహించుచుండిరి. 1875 సంవత్సర ఈశ్వర సంవత్సరమున అచ్చటి కమ్మ ప్రముఖులచే నాహ్వానింపబడి, గుడివాడ తాలూకాలో చేరినట్టి బందరునకు సుమారెన్మిది మైళ్ల దూరములో నున్న డోకిపర్రు గ్రామమున ప్రవేశించి యక్కడ నొక పాఠశాల నేర్పరచిరి. పెక్కండ్రు విద్యార్థులు చేరిరి. వీరిలో చాలవరకు కమ్మవారుగా నుండిరి. అప్పుడా డోకిపర్రున నొక ఉదారకమ్మ కులీనుడు పోలవరపు హనుమయ్యగారను వారుండిరి. వీరికేమి, ఆయూరి కమ్మవారి కేమి, వారి సంఘములో విద్యావ్యాపకమును చేసిన వారగుటచేత శ్రీరాములుగారి యెడల మిగుల భక్తి, మిగుల విశ్వాసము. శ్రీరాములుగారాగ్రామమున 1878 ఏప్రియలు మాసమువరకుండిరి. పాఠశాల వలన సంవత్సరమునకు సుమారు రు.1500 వరకు గడించు చుండిరి. ఈ కాలముననే తెలుగు ఇంగ్లీషు జనరలు టెస్టులను పరీక్షలలోను తెనుగు లో ప్లీడరు పరీక్షలోను ఉత్తీర్ణులైరి. ఈయన డోకిపర్రులో నున్నప్పుడే 1876 సంవత్సరము అక్టోబరులో వారి అయిదవ కుమారుడనైన నా (–విష్ణురావు–) జన్మము. ఈ కాలమున శ్రీరాములుగారు 'సంవర్ణోపాఖ్యానమను' గ్రంథమును 'లక్షణా విలాసమను' ఒక యక్షగాన రూపకమును రచించిరి. 'సంవర్ణోపాఖ్యానమును' నేను చూడలేదు గాని 'లక్షణా విలాసమును' చాలసారులు ఆసక్తి తోడను వినోదముతోడను చదివెడివాడను. లక్షణా విలాసములోని చాకలి వర్ణనను గురించిన యొక సీస పద్యభాగము నాకు జ్ఞాపకము. అదియేదనిన– "బోయియై పల్లకీల్మోయగా మోయగా కాయలెక్కిన బుజాల్గలుగువాడు. వేనవేల్మషాళ్లు వేయగా చట్టులెక్కిన యరచేతిపట్టువాడు ..... డంబు మీరిన పిల్లి గడ్డంబు వాడు ... "

శ్రీరాములు గారి యౌదార్యము, పట్టుదల, విద్యా భిమానముల కుదాహరణముగా, వారీయూరనున్నప్పుడు జరిగిన వివేషము నొకదానిని చెప్పక తప్పదు. సూరి సీతారామశాస్త్రి యను వైయాకరణి, పిన్నవయస్కుడు, ధనార్థియై శ్రీరాములుగారి యొద్దకురాగా ఆయువకుని నాదరించి తన యింటనుంచుకొని, యన్న వస్త్రములనిచ్చి, యింగ్లీషు భాషను గఱపి, తెనుగు ప్లీడరీ పరీక్షకు తయారుచేసి యాయన ప్లీడరీ పరీక్షలో కృతీర్థులగునట్లు చేసెను. ఆయన యొద్ద వీరు 'సిద్ధాంత కౌముది' 'శబ్దేందు శేఖరము' మున్నగు గ్రంథముల జదివిరి. సీతారామశాస్త్రులుగారు న్యాయవాదియై పల్నాడు తాలూకాలోనప్పుడున్న కారెంపూడి డిస్ట్రిక్టు మునసపు కోర్టులో వృత్తిని నడిపి ధనార్జన చేసినారు. ఇప్పుడీ సీతారామశాస్త్రులువారు కీర్తిశేషులయినారు. 1878 సంవత్సరముతో డోకిపర్రు విడిచి, న్యాయవాద వృత్తికై బందరు చేరవలసి వచ్చెను. డోకిపర్రు విడుచునప్పుడు వీరియందు తమకుగల భక్తి విశ్వాసముల ప్రకటించుటకు ఆయూరి కమ్మవారు, వీరిని వెండి పువ్వులచే పాదపూజ చేసి, బంగారు పూలచే శిరస్సును పూజించి, తామే మోసి, పల్లకిలో వీరినూరేగించి అమితముగా గౌరవించినారు. ఆ మేనాసవారిని తరువాత బందరులో న్యాయవాదిగా నున్నప్పుడు వీరుపయోగించి కోర్టునకు బోవుచుండిరి. ఇంతటితో వీరి ఉపాధ్యాయ వృత్తి ముగించెను. వీరు గుడివాడ, కవుతురము, డోకిపర్రులలో అతిగౌరముగా అతిసమర్థతలో నెఱపిన విద్యాబోధన అద్వితీయము. మొద్దు బండలను సహితము విద్యావంతులుగా జేయగలిగిరి.

ఇట్లు 1878 సంవత్సరము ఏప్రియలులో అనగా బహుధాన్య సంవత్సర చైత్రమాస ప్రాంతమున న్యాయవాద వృత్తికై శ్రీరాములుగారు బందరు ప్రవేశించిరి. ఇప్పటికి వీరికి అయిదుగురు కుమారులు. బందరు గొడుగుపేటలో ప్రథమమున కొంత వరకు కలిపురపు కుటుంబరాయుడుగారింటిలోను, కొంతవరకు కలిపురపు రామస్వామిగారి యింటిలోను నివాసమేర్పరుచుకొని తన తల్లిగారితోనుండిరి. తరువాత మామిడాల వెంకన్న పంతులుగారింటిలోనుండిరి. తమ వృత్తి ప్రథమ దినములలో ఈయన మశూచి గ్రస్తుడాయెను. అంతట మశూచికములోనే అల్లూరునకు స్వగృహమునకు గొంపోబడెను. అక్కడ స్వస్థులయినారు.

ఆయంటువ్యాధి యిల్లెల్ల జుట్టబెట్టెను. అప్పుడే, నా రెండవయేట, మశూచి నేను అనుభవించితిని. మాయన్నదమ్ములలో నేనొకడనే మశూచికము పడ్డది. ఇదే సమయములో శ్రీరాములుగారికి ఆరవ కుమారుడైన మధుసూదనరావు జ్యేష్ఠ శుద్ధ 15 నాడు పుట్టెను. అందరు ఆరోగ్యవంతులైన వెనుక బందరులో శ్రీరాములుగారు తిరిగి ప్రవేశించి తనవృత్తిని అవిచ్ఛిన్నముగా సాగింప దొడగిరి. వృత్తిని దీక్షతో, శక్తితో సామర్థ్యముతో నిర్వహించిరి. అప్పుడు పై చెప్పిన కలిపురపు రామస్వామి గారి కుమారుడు శేషయ్యగారు వీరి గుమాస్తా, వారి అక్క తిమ్మరాజు కన్నమ్మ అను ఆదెమ్మగారు. మామిడాల వారి యింటిలో శ్రీరాములుగారు కాపురముండి నప్పుడు శేషయ్యగారును, రాజమ్మగారును ఆయింటిలోనే ఒక భాగములో కాపురముండెడివారు. అప్పుడు కామేశ్వరరాయుడు గారు, సుందరరావు, ఆదెమ్మగారులు మా యింటికి తరుచు వచ్చుచుండెడివారు. ఈ విషయము మరికొంత దిగువన విష్ణురావు (–నా–) చరిత్రలో రాగలదు. ఈ శేషయ్యగారి భార్య రాజమ్మగారు 1882 సంవత్సర ప్రాంతమున చనిపోగా శ్రీరాములుగారి చివర మేనమామయు, గండ్రము గ్రామములో తన అత్తవారింటికి – గండ్రపు బసవరాజుగారి – యిల్లటము అల్లుడుగా వెళ్లినట్టియు కూరాడ రామస్వామిగారి ప్రథమ పుత్రిక లక్ష్మీ నరసమ్మగారిని, మా నాయనగారి రాయబారము చొప్పున శేషయ్యగారు వివాహమాడిరి. గండ్రపు బసవరాజుగారికి పుత్రసంతానము లేని హేతువు చేత రామస్వామిగారి ద్వితీయ కుమారుడు బసవరాజును – దౌహిత్రుడైనను దత్తునిగా స్వీకరించిరి. ఈ చిన బసవరాజుగారిప్పుడు బందరు తాలూకా గండ్రములో నున్నారు. రామస్వామిగారి యావత్తు కుటుంబము గండ్రమే చేరినది. వీరిప్పటికిని గండ్రములోనే యున్నారు.

శ్రీరాములుగారు ఊపిరాడక ప్లీడరు వృత్తిని నిర్వహించుచున్నప్పటికి, తన సాహిత్యశాస్త్రముల నభివృద్ధి నొందించుకొనుట మానలేదు. సాంఘిక మత విషయములలోను సాహిత్యసంబంధ విషయములలోను, కృషిచేయుచునే యుండిరి. బందరు గొడుగుపేటలో నున్నప్పుడే ఇంగ్లీషు కిమ్రినలు హైయ్యరు సివిలు హైయ్యరు పరీక్షలకు భాషాంతరీకరించు పరీక్షలోనుత్తీర్ణులైరి. ఇంగ్లీషు ప్లీడరు గాగలిగినారు. వీరే పరీక్షకు చదివినను సులభముగా విషయములను సాధ్యమగువరకు పద్యములలోనిమిడ్చి జ్ఞాపకముంచు కొనుచుండిరి. నా చిన్నప్పుడు అట్టి పద్యములను పిల్లల వినోదమునకై చదువుచుండెడివారు. ఇదే సమయములో 'అనల్ప జల్పితా కల్ప కల్ప వల్లి' యను నొక పుస్తక రూపమైన మాసపత్రికను సాంఘిక మత విషయములను గూర్చి కొంతకాలము అచ్చు వేయించి ప్రకటించుచుండిరి. కీ.శే.రా. కందుకూరి వీరేశలింగముగారు ఇంచుమించదే కాలమున తమ విధవా వివాహోద్యమ వ్యాప్తికై ఆంధ్రదేశమున పర్యటనమొనరించిరి. శ్రీరాములు గారప్పటిలో కొన్నినాళ్లు విధవా వివాహ పక్షమును కొన్ని దినములు ప్రతి పక్షమును అవలంభించి యుండిరి. ఈ కాలమున బందరులో దక్షిణదేశ వైష్ణవులైన పి.టి. రాఘవాచారిగారను నొక డిప్యూటి కలక్టరుగారుండెను. ఈ రాఘవాచారిగారు వినోద ప్రియుడు. కూచిపూడి భాగవతులలో వెంపటి కోదండరామయ్య యను నొక ప్రసిద్ధ స్త్రీ వేషధారియు, హాశ్యగాడైన తాడేపల్లి విస్సయ్య యను నాయనయు నుండిరి. వీరి భాగవతాది కాలక్షేపములు రాఘవాచారిగారు శ్రీరాములుగారి సహాయమున నడిపించెడివారట. ఈ రాఘవాచారిగారికి నలుగురు కుమాళ్లు. పెద్దవాడు నరసింహాచారిగారు. బందరు జిల్లా కోర్టులో 1902 ప్రాంతమున ప్రసిద్ధముగా ప్రాక్టీసు చేసి చిన్నతనములో చనిపోయిరి. రెండవ వాడు శ్రీనివాసాచారి. నా అన్నగారైన మాధవరావు గారితో సహాధ్యాయుడు. జిల్లా కలెక్టరుగాను, వెంకటగిరి దివానుగాను నుండి ఉపకార వేతనముతో నిప్పటికి మదరాసులో నున్నారు. మూడవవాడు జగన్నాధాచారి నా సహాధ్యాయుడు. నా తోడనే బి.యెల్. ప్యాసుచేసి, జిల్లా కోర్టు సిరస్తాదారు మొదలు జిల్లా జడ్జి పదవివరకునుద్యోగముల చేసి, ఉపకార వేతనముతో నిప్పుడు మదరాసులో నున్నాడు. నాల్గవవాడు 'పయ్యా' అని మేము పిల్చుచున్నవాడు పోలీసు డిపార్టుమెంటులో పనిచేసినాడు. ఇప్పటికి రిటైరయి యుండవచ్చును. వెంపటి కోదండరామయ్యగారి కుమారుడే వెంపటి వెంకటనారాయణయను సుప్రసిద్ధ భామవేషగాడు. తాడేపల్లి విస్సయ్యగారి కుమారుడు వెంకట కృష్ణయ్య బందరు జిల్లాకోర్టులో రికార్డు కీపరుగా నుండెను. మా అన్నగారు, నారాయణరావుగారు నిర్వహించిన బందరులోని నేషనలు ధియేటరులో మెంబరుగా నుండెడివాడు.

శ్రీరాములుగారిప్లీడరీ ప్రారంభములో కీ.శే. యల్లేపద్ది జానకిరామయ్య గారు, సింగరాజు సుబ్బారాయుడుగారు, వడ్లమన్నాటి దామోదరయ్యగారు, రుద్రవరపు హనుమంతరావుగారు, అయ్యంకి సుబ్బారాయుడుగారు మున్నగువారు సమకాలీనులు.

తరువాత పురాణం వెంకటప్పయ్యగారు కొన్ని దినములు మానాయనగారి సమకాలీనులు. మున్నంగి రామయ్య పంతులు గారు, ఓరుగుంట శివరామకృష్ణయ్యగారులు మునసపులు రివరెండు ప్యాడ్ఫీల్డు – పీలు – హోడ్జను గారులు మిషనరీలు నోబిల్ కాలేజి ప్రధాన ఉపాధ్యాయులు. తట్టా శ్రీనివాసాచార్యులు గారు, కుంభకోణం కృష్ణమాచార్యులు గారలు హిందూ హైస్కూలు హెడ్మాష్టరులు. నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితులుగారు నియోగి శాఖా సంస్కర్తలు. వీరు శ్రీరాములుగారు బందరునకు వచ్చుసమయములోనే సిద్ధిపొందినారు. కాని యాయనచేసిన ప్రచారఫలితముగా నియోగి వైదిక కక్షలేర్పడి ప్రబలముగా నుండెను.

గొడుగుపేటలో కాపురమున్నప్పుడు మోటుపల్లి నాగేశలింగము అను నొక గ్రామ మునసపు వీరి యింటికి దగ్గరలో కాపురముండిరి. ఈయన పెద్ద కుమారుడు రాఘవయ్య కేశవరావుగారి ముఖ్య స్నేహితుడు. ఈతని కథ కేశవరావుగారి కథలో నిమిడ్చి కొంత జెప్పెదను. ఈ కాలములోనే శ్రీరాములుగారి మొదటి కుమారుడు కేశవరావుగారి వివాహము 1880 జూలై నెలలో జరిగెను. ఇప్పటి గుంటూరు జిల్లా తెనాలి తాలూకా – అప్పటి కృష్ణాజిల్లా రేపల్లె తాలూకాలో జేరినట్టి కొండముది కాపురస్తులు – అప్పుడు బొంబాయి ప్రెసిడెన్సీ ధార్వాడ జిల్లాలో తహస్సీల్దారు పదవిలో నుండిన కొండముది రామచంద్ర రావుగారి ప్రథమ పుత్రికను కేశవరావు గారికి బాపట్లలో వివాహము చేసిరి. ఈ విషయము ఇంకను విపులముగా కేశవరావుగారి గాధలో చెప్పబడును. 1881 సంవత్సరములో శ్రీరాములుగారికి కనిష్ఠ సంతానమైన కూతురు శారదాంబ కలిగెను. ఈమె విషయము ఈమె గాధలో ప్రత్యేకముగా వ్రాయబడును. 1882 లో బందరు నిజాము పేటలో నొక పెద్ద మేడను కొని దానిని బాగుగా సంస్కరించి యందులో శ్రీరాములుగారు ప్రవేశించిరి. బందరును వదలి ఏలూరునకు వచ్చువరకు ఆమేడలోనే కాపురము చేయుచుండిరి. ఈ మేడలో నుండగానే పైచెప్పిన మోటుపల్లి రాఘవయ్య మున్నగు స్నేహితుల ప్రేరణమున ప్రతిజ్ఞపట్టి వారము దినములలో 'అభినవ గద్య ప్రబంధనము' అను నొక చిత్రకల్పనా కథను వ్రాసిరి. పద్యమున గాక గద్యలో నుండుటతప్ప తక్కిన విషయములన్నిటి యందును పెద్ద ప్రబంధరీతిని విరచింపబడెను. ఇందలి కథా కల్పన, వివిధ విషయవర్ణన, భాషాసౌందర్యము కలిగి చదువుటకు చాల హృద్యముగ నుండును. ఈ రచన కాలమున శ్రీరాములుగారి ప్లీడరీ ప్రాక్టీసు అమితముగా నుండెను. అట్లుండియు కార్యదీక్షచే నీ పుస్తకమును ఏడు దినములలో వ్రాయగలిగిరి. 'సర్వజ్ఞత్వము సాంబమూర్తిది' అను పద్యము ఈ గంధ్ర పీఠికలోనిది. సుమారీ దినములలో శ్రీరాములుగారు స్టీమరు పైన మదరాసు వెళ్లినారు.

నిజాము పేటలో వాసముచేయు దినములలో కేశవ రావుగారు మెట్రిక్యులేషను పరీక్షకును, నారాయణ, మాధవరావుగారలు మిడిల్ స్కూలు పరీక్షకును వెళ్లిరి. కేశవరావుగారు పరీక్షలలో తప్పినారు. నారాయణరావుగారు 3వ క్లాసులోను, మాధవరావుగారు 1వ క్లాసులోను గెల్పొందినారు. 1883 సంవత్సర భాద్రపద మాసములో కేశవరావుగారి మామగారగు కొండ ముది రామచంద్రరావుగారు బొంబాయిప్రెసిడెన్సీ కార్వారుజిల్లా యల్లాపురములో చనిపోయినారు. 1883 సంవత్సరములో శ్రీరాములుగారు ఫస్టుగ్రేడు ప్లీడరు పరీక్షకు, రెండవ గ్రేడు ప్లీడరు, పని వత్తిడిగా చేయుచున్న దినములలో చదివి 1884 సంవత్సరము జనవరిలో జరిగిన పరీక్షకు రాజమండ్రి వెళ్లి పరీక్ష నిచ్చి వచ్చినారు. ఇట్టి తరుణములో కేశవరావుగారు, పరీక్ష తప్పినదన్న పట్టుదల మీదనో లేక సహజ సాహస వృత్తిని బట్టియో ఒకనాటి రాత్రి తనతో సమ వయస్కుడైన మా కడసారి మేనమామగారైన కూరాడా బాలకృష్ణారావుగారితో ఎవ్వరికి తెలియనీయక స్కూలు జీతములకై తండ్రిగారు తన చేతికిచ్చిన ధనమును, తన వెంటనున్న మురుగులు మొదలగు వస్తువులతోను ఎక్కడికో పలాయనమైనాడు. ఈ విషయములో శ్రీరాములుగారును ఇతర బంధువులను పడ్డచింత యెంతై యుండునో, ధన వ్యయమెంత యాయెనో? తుదకు ఆచూకీలు తీసి, తూర్పుదేశము ప్రక్కకు పోయినట్లు తెలిసి, శ్రీరాములుగారు, వీరి తల్లిగారు కామమ్మగారు, వీరి అత్తగారు కూరాడ సర్వలక్ష్మమ్మగారు, మా మేనమామలలో మూడవవాడైన అచ్యుత రామయ్యగారు, మా గ్రామములో మాకు ముఖ్యసేవకుడైన బోయిన సుబ్బాయి అను నాతడు మా స్వంత బండి మీద తూర్పుదేశమునకు బోయి, తుట్టతుదకు గంజాం జిల్లా శ్రీకాకుళములో కేశవరావు గారిని బాలకృష్ణారావుగారిని పట్టుకొన్నారు. పట్టుకొని కేశవరావుగారిని వెంట తీసుకొని 3 మాసములకు తిరిగి వచ్చిరి. బాలకృష్ణారావు గారు శ్రీకాకుళములోనే కొన్ని సంవత్సరములుండిపోయిరి. ఇప్పటికి 1884 సంవత్సరము మే మాసము వచ్చినది. ఈ పర్యటన సందర్భమున శ్రీకాకుళములోని

తిమ్మరాజు శివయ్యగారు విజయనగరములో దివాస్ జగన్నాధరాజుగారు, చేవూరి సన్యాసి రాజుగారు విశాఖపట్టములో శ్రీ పతి సూర్యనారాయణగారు వీరికి పరిచితులైరి.

అంతట శ్రీరాములుగారును భార్య జానకమ్మగారును కేశవరావుగారును అంతకు ముందు ముండమోసి వచ్చిన వియ్యపురాలైన కొండముది జానకమ్మగారిని చూచుటకు బాపట్ల వెళ్లినారు. వీరు వెళ్లునప్పటికి ఫస్టుగ్రేడు పరీక్షలో శ్రీరాములు గారు ప్యాసైనట్లు తెలిసినది. శ్రీరాములుగారి అదృష్టవశాత్తు ఆసంవత్సరము జూలై నుండి కడలూరులో నదివరకున్న సబుకోర్టును ఏలూరునకు మార్చినట్లును జూలై 1 వ తేది నుండి ఏలూరులో పని జరుపుననియు తెలిసి, శ్రీరాములుగారా కోర్టులో నుండుటకు యోచించి, ఏలూరు సంధర్భములేమో తెలుసుకొనుటకుగాను బాపట్లనుండి వచ్చు దారిలో బెజవాడ నుండి భార్యను బందరు పంపి తాను ఏలూరునకు వెళ్లెను. అక్కడి సందర్భములు అనుకూలముగా నుండునని భావించి బందరునకు రాకయే అక్కడనే కొందరి స్నేహితులను సంపాదించుకొని సబుకోర్టులో పెద్ద వాజ్యములు దాఖలు చేయసాగిరి. ఏలూరునకు వచ్చిననాడే చిదుకుర్తి వెంకటస్వామిగారను నొక వైశ్యవర్తక శిఖామణి శ్రీరాములు గారికి ముఖ్య క్లయంటును నాయెను. శ్రీరాములుగారు మొదటగా దాఖలుచేసిన వ్యాజ్యము లీయనవే. ఈయన కుటుంబము మా కుటుంబ స్నేహితులైరి. ఏలూరు సబుకోర్టులో మొదట దాఖలు అయిన పెద్దవ్యాజ్యములో మొదటి నంబర్లు అన్నియు, కొన్ని యీయన దాఖలు చేసినవేయని శ్రీరాములుగారు వ్రాయించి యుంచిన పాత కాగితముల పొతకలో వ్రాయబడి యున్నది. బందరునుండి ఏలూరునకు నిర్గమనమునకు కారణమిది. ఇది 1884 సంవత్సరము జూలైనెలలో. ఇంతటితో మావంశమునకు ఏలూరు కేంద్రస్థానమైనది. ఈ ఏలూరు నివాసములోనే శ్రీరాములుగారు అత్యంతకీర్తిని సంపాదించినది. ఇట్లు ఏలూరులో దినదినాభివృద్ధిగా 1895 సంవత్సరం జూలై వరకు ఫస్టుగ్రేడు ప్లీడరుగా నుండిరి. వీరు ఏలూరులో నున్నప్పుడు ఆదెప్పశెట్టి, వెంకటరంగయ్యరు, మనవాళ్లయ్య, మద్దిరాల బుచ్చి సుందరరావు, స్వామినాధయ్యరు, గారులు సబుజడ్జీలు. పాలంకిపాటి వెంకటరమణయ్య, వారణాశి లక్ష్మీనరసింహం, ఉదయగిరి గోపాలరత్నం, కోకా వెంకటరత్నము నాయుడు, గోలేటి వెంకటశివరావు (లక్ష్మీనారాయణగారి తండ్రి) బండికట్ల ప్రభులింగము, ఆచారి – సాతాని – జంధ్యాల గౌరీనాధశాస్త్రి, ములుకుట్ల అచ్యుతరామయ్య గార్లు న్యాయవాదులలో ప్రముఖులు తరువాత వెమ్మరాజు గోపాలము గారు మొదలయినవారు వచ్చిరి.

ఏలూరునకు రాగానే తూర్పు వీధిని సంతాన గోపాలసామి కోవిలెకు సమీపములో గుండువారి మిడతకు మన్ను పూసిన చిన్న కొంపలో ప్రవేశించి యొక సంవత్సరము పైకాలము అక్కడ నుండి, ఆ కొంపకు ఎదురుగానున్న కొవ్వలి కాపురస్తులు వడ్లపట్ల మారెయ్యగారి యింటిలో ప్రవేశించినారు. ఈ యింటిలో యజమాని వశమందు కొన్ని ధాన్యపు కొట్లుండెడివి. వీనిలో ధాన్యము పోసినపుడును తీసినపుడును మా కుటుంబమునకు మిక్కిలి దుర్భరముగా నుండెడిది.

ఏలూరునకు శ్రీరాములుగారు వచ్చిన కొన్ని దినములకే కేశవరావుగారు వచ్చిరి. ఆ వెంటనే నేనును నాయనమ్మగారును, నాయనగారి మేనత్త కుమారుడు గారగు కృష్ణయ్యగారును వచ్చినాము. తరువాత మా అమ్మగారును, నా తమ్ముడు మధుసూదనరావును చెల్లెలు శారదాంబయును వచ్చిరి. నారాయణరావు, మాధవరావు, గోవిందరావుగారును, వారితోనే మా యింట్లో పుట్టిననాటనుండియు నున్న ఉప్పలూరి మల్లికార్జునరావును బందురులోనే యుండిరి. ఈ సమయములోని మా యన్నదమ్ముల కథలను మా చరిత్రలలో చూచెదరు. 1885 సంవత్సరము మార్చి ఏప్రియలు నెలలో నారాయణరావుగారికి సైదేపూడిలో మారెళ్ల వీర్రాజుగారి ప్రధమ కుమార్తె వెంకట లక్ష్మిగారిని, మాధవరావుగారికి ఉప్పలూరి కనకయ్యగారి రెండవ కుమారై కామేశ్వరమ్మగారినిచ్చి అల్లూరులోను వివాహములు జరిపిరి. గోవిందరావు, మల్లికార్జునరావుగారల ఉపనయనములు ఆ సందర్భములో యయినవి.

శ్రీరాములుగారి ప్రాక్టీసు వృద్ధియగుచున్నది. జమీందారులు పలువురు వీరియొద్దనే తమ కోర్టు వ్యాజ్యముల నిచ్చుచుండిరి. ఈ జమీదారులలో నిద్దరిని మాత్రము చెప్పుచున్నారు. ఒకరు ఈ కథాపూర్వభాగములో చెప్పిన వల్లూరు జమీదారుగారు వెంకట నరసింహనాయుడు బహద్దరుగారు. రెండవవారు ఈ కథా పూర్వభాగములో చెప్పిన నూజీవీడు శోభనాద్రి అప్పారాయణం

గారి చివర కొడుకును నూజివీడి సంస్థానములో ఒక అదన భాగమైన మేడూరి సంస్థానమునకు యజమానియు, నిడదవోలు యెస్టేటు యజమానియయిన నారయ్యప్పారావుగారి భార్య పాపమ్మరావు గారు దత్తు చేసుకున్న వెంకట రామయ్యప్పారావుగారును అయి యున్నారు. బొమ్మదేవర వెంకట నరసింహనాయుడుగారు శ్రీరాములుగారి ప్రాక్టీసు తుదివరకు శ్రీరాములుగారి క్లయింటుగానే ఉండెను. కాని వెంకటరామయ్యప్పారావు గారు 1888 సంవత్సరము జనవరి 1వ తేదీన అకాలముగా మృత్యువాతను బడుటచే ఆ యెస్టేటు విషయములోనే వెంకటరామయ్యప్పారావుగారి దత్తత విషయములో బాధ్యురాలు గాదను వెంకటాద్రి అప్పారావుగారు – పార్థసారధి అప్పారావుగారి తండ్రి – ఒ.య.స్. 14 ఆఫ్ 1888 – మద్రాసు వ్యాజ్యము వేయుట చేతను వెంకటరామయ్య అప్పారావుగారి కుమారుడు నాదయ్యప్పారావుగారు మైనర్లయినందున యెస్టేటు కోర్టు ఆఫ్ వార్డ్సులో చేరుట చేతను ఆ యెస్టేటు వ్యాజ్యములు శ్రీరాములుగారి వద్దకు రాక నిలిచిపోయెను. వెంకటరామయ్యప్పారావు గారు చనిపోయినదాది సుమారు 30–60 సంవత్సరముల వరకు వ్యాజ్యము తీరనేలేదు. ఇట్లు మోడూరు ఎస్టేటు కోర్టుఆఫ్ వార్డ్సులో నుండగా వెంకట్రామయ్యప్పారావుగారి కుమారుడు నారయ్యప్పారావు గారిని పాపమ్మారావుగారు దత్తత చేసుకున్నది. 1889 లో పాపమ్మారావు గారు చనిపోయినది. నారయ్యప్పారావుగారి దత్తత రద్దు నిమిత్తము వెంకట్రామయ్యప్పారావు భార్య వెంకయ్యమ్మారావుగారు 1895 లో ఒ.యస్. 35 ఆఫ్ 1895 వ్యాజ్యము దాఖలు చేసినది. వ్యాజ్య మధ్యమందు నారయ్యప్పారావు చనిపోయినాడు. నిడదవోలు ఎస్టేటు విభాగమునకును, వెంకయ్యమ్మారావు వ్యాజ్యము చేసిన మేడూరు ఎస్టేటు విభాగమునకు – నూజివీడు రంగయ్యప్పారావు వెంకట నరసింహప్పారావులు, పార్థసారధి అప్పారావుల మధ్య ఒక పెద్ద వ్యాజ్య గంధ్రము జరిగి అన్ని వివాదలు 1920 ప్రాంతమున తీరినవి.

ఏలూరులో నుండగా శ్రీరాములుగారికి మరికొన్ని జమిాలు కూడా క్లయింట్లుగా నుండెను. కొన్ని దినములు గవర్నమెంటు కోర్టు ఆఫ్ వార్డ్సు ప్లీడరుగా కూడ నుండిరి. పెద్దపెద్ద వారసత్వపు వ్యాజ్యములు, ముఖాసా వ్యాజ్యములు శ్రీరాములుగారి చేతి మీదనే నడుపబడినవి. ఏలూరు సబుకోర్టున కపుడు విరిమైన జ్యూరిస్‌డిక్షన్ ఉండెను. గోదావరి జిల్లా కోర్టు నుండి అమలాపురము తణుకు, నర్సాపురము తాలూకు అప్పీళ్లు విచారణ నిమిత్తము ఏలూరు సబుకోర్టుకు ట్రాన్సుఫరు కాబడెడివి. కృష్ణాజిల్లాలో చాల భాగము మీద ఒరిజినల్, స్మాలుకాజు జ్యూరిస్‌డిక్షన్ ఉండెడిది. ఇట్టి పరిస్థితులలో శ్రీరాములు గారు ఆర్జించిన ధనము అమితమై యుండనోపు. పైచెప్పిన జమిాదారులలో వెంకటరామయ్యప్పారావుగారు శ్రీరాములుగారికి క్లయింటు అగుటయేగాక, స్వయముగా తాను పండితుడగుటచేత శ్రీరాములుగారి యెడల అమిత గౌరవము. శ్రీరాములుగారు 1887 సంవ్సరము మేయి జూన్ నెలలో తన అయిదవ కుమారుడైన నా యుపనయనమును, నాల్గవ కుమారుడైన గోవిందరావు గారికి గుంటూరులో (గోవిందరాజుల భావనారాయణగారి రెండవ కుమార్తె సుందరమ్మను ఇచ్చి) వివాహమును చేయ తలపెట్టి వెంకటరామయ్యప్పారావు గారితో ఆ విశేషములు శనివారపు పేటలో మనవి చేయగా – ఆయన శనివారపు పేట నుండి ఏలూరునకు వచ్చుటకు మేనా యెక్కుచుండగా 1,000 రూపాయల సంచిని మేనాలో నుంపించిరట. అల్లూరు వ్యవసాయమునకు గాని ఏలూరులో తన యుపయోగమునకు గాని ఎద్దులు గావలసినప్పుడు వెంకట నరసింహనాయుడు గారిని అడిగిన యెడల వల్లూరి లంకలలో మేయు తన పశుగణములలో స్వేచ్ఛగా నే దానినైనను తీసికొనుడని శ్రీరాములుగారికి చెప్పుచుండెడువాడట.

బొమ్మదేవరవారి ఆస్థాన గ్రామమయిన తోట్లవల్లూరులోని వేణుగోపాలస్వామి కంకితముగా శ్రీరాములుగారెన్నియో కృతులు, జావళీలు, పదములు స్వరజతులు జెప్పినారు. ఈ జావళులు పదములు కొన్ని సంవత్సరముల క్రిందటి వరకు ఈ ప్రాంతపు వేశ్యలు పాడుచుండిరి. శ్రీరాములుగారు ప్రాక్టీసు మానిన వెనుకను కూడ, వెంకట నరసింహనాయుడుగారు తన యెస్టేటులో ఏలూరునకు సమీపముగా నున్న సోమవరపు పాడు గ్రామములో 50 ఎకరముల భూమి జిరాయితిగా శ్రీరాములు గారికిచ్చినారు. ఏలూరు కోర్టు జ్యూరిష్‌డిక్షన్‌లోని పెద్ద జమిాదారులు చిన్న జమిాదారులు మొఖాసాదారులు వర్తకులు ఇతరులందరు శ్రీరాములుగారికి క్లయింటులనియే చెప్పవచ్చును. 1888 వ సంవత్సర మేయి నెలలో ఆరవ కుమారుడు మధుసూధనరావు గారి యుపనయనమును, ఏక పుత్రి శారదాంబ వివాహమును అల్లూరులో చేసిరి. శారదాంబను బందరు కాపురస్తులు, అప్పుడు

బాపట్లలో తహస్సీలుదారి పదవిలో నున్న వేమూరి రామన్న పంతులుగారి రెండవ కుమారుడు రామచంద్రరావు గారికిచ్చి వివాహము చేసిరి. ఈ వివాహము కడు వైభవముగా జరిగినది. చాల క్రయమయినది. ఈ కాలములో శ్రీరాములుగారి పుత్రుల విద్యా విషయమును గూర్చి వారివారి చరిత్రలలో వ్రాయబడును. అల్లూరులో వ్యవసాయాదులు కొంతవరకు ఉప్పులూరి కనకయ్య, కృష్ణయ్యగార్ల పరామర్శ క్రిందను, కొంత శ్రీరాములుగారి తల్లి కామమ్మగారి పరామర్శ క్రిందను జరుగుచుండినవి. ఈ సమయములో శ్రీరాములుగారి తండ్రి కన్నయ్యగారు వృద్ధులై దుర్బలులై యుండిరి. 1889 వ సంవత్సరములో వడ్లపల్లివారి యింటి నుండి పవరుపేటలో కోవళం లక్ష్మీనరసింహం పంతులుగారు యొక్క యింటికి మారిరి. ఈ యింటికి ఎదురున కాలవకు దక్షిణమున జిల్లెళ్లమూడి వారి తోటయను నొక కొబ్బరితోటలో నొకసుమారు యకరము శ్రీరాములుగారు స్వగృహ నిర్మాణమునకు కొన్ని సంవత్సరముల క్రిందట తీసియుంచి, దానిలో 1889 వ సంవత్సరము ప్రారంభములో నిర్మాణారంభము చేసిరి. కాని నిర్మాణ మధ్యమున ఆసవంత్సరం మార్చి8వ తేదీన తండ్రిగారు అగు కన్నయ్యగారు గతించిరి. కాని గృహనిర్మాణమాగలేదు. ఆ సంవత్సర వైశాఖమాసములో తాము ఏటిసూతకము వలన గృహప్రవేశపు పీటల మీద కూర్చుండుటకు వీలులేక, ఆయన ద్వితీయ కుమార్డు నారాయణరావు గారిని రెండవ కోడలు వెంకట లక్షమ్మగారిని పీటలపై కూర్చుండబెట్టి గృహప్రవేశ కార్యమును నిర్వర్తింపజేసినారు. ఈ యిల్లు ఏలూరులో కడు ప్రాముఖ్యమయిన ప్రదేశములో ఒక తోటమధ్యలో కాలువ గట్టున విశాల ప్రదేశములో నుండి ఒక పెద్దమంచి నీరుగల భావిని గలిగి యుండుటచేత మిక్కిలి ప్రసిద్ధికెక్కినది. ఈ యిల్లు 1924 వ సంవత్సరము జూన్ వరకు మా క్రిందనే యుండుచూ వచ్చి తుదకు మా సోదరుల విభాగమునకు అవశ్యకమై, గాంధీనేషనలు స్కూలు వారికి విక్రయింపబడినది. గాంధీ నేషనలు స్కూలు ఇప్పుడు అచ్చటనే నెలకొల్పబడియున్నది.

శ్రీరాములు గారి ధైర్యసాహసములకు ఉదాహరణముగ నొక విషయము చెప్పవలెను. ఏలూరు తాలూకా ఉత్తరభాగమున సుమారు 20 మైళ్ల దూరములో కామవరపుకోటయను పెద్దగ్రామమునకు 2 మైళ్ళదూరమున్న నైరుతిమూలను ఖండ్రిక సీతారామవరమను ఒక మూడూళ్ల గ్రామ సమూహమున్నది. ఈ గ్రామములు నిడదవూలు యెస్టేటులో చేరినవయి యున్నవి. వీని స్వానుదారులు వీర ప్రతాప కోరొండ హం వీర రామచంద్రరాజుగారను క్షత్రియులు. ఈ గ్రామముల మీద నిడదవోలునకు కట్టుబడి తీసికొను హక్కు మాత్రమున్నది. ఇట్లుండ ఆ క్షత్రియులు చేసిన ఋణములకుగాను తనఖాగానుంపబడి తుదకొక వ్యాజ్యమున పాపమ్మారావు జమీందారుగారి స్వాధీనమున బడినవి. 1890 ప్రాంతముల క్షత్రియస్వానుదారులు ఆ గ్రామములకు విమోచన గలిగి తమస్వాధీనము కాగలవాయని శ్రీరాములు గారిని సలహాయడుగగా నా లోచించి మార్గమున్నదన్నట్లు గట్టిగా నమ్మి వాని విమోచనకై తాను తన ధనముతో వ్యాజ్యమాడెదననియు, గెలిచిన పక్షమున సగము తనకిమ్మనియు క్షత్రియులను శ్రీరాములుగారు కోరగా నందుకు క్షత్రియులు సన్నుతించినారు. అందుకై క్షత్రియుల పేరనే 1891వ సంవత్సరములో ఏలూరులో సబ్‌కోర్టులో పాపమ్మారావు జమీందారుగారు వగైరాల మీద వ్యాజ్యము దాఖలు చేసినారు. మొదటి కోర్టులో శ్రీరాములుగార్కి అపజయము – 5.9.91. హైకోర్టులో జయము 21.2.93 అందుపై పాపమ్మారావు గారు ప్రీవీ కౌన్సిలుకు పోగా ధనలోపముచేత శ్రీరాములుగారు అచ్చటవాదన చేయలేక పోయినను పరోక్షమందే పాపమ్మారావుగారి అప్పీలును ఖర్చులతో త్రోసివేసినారు. 22.2.96.–19 మద్రాసు 249 పి.సి. ఈ వ్యాజ్య గ్రంధము పూర్తి 1897లో శ్రీరాములుగారి పక్షమున తుదముట్టెను. గ్రామములను రాబట్టుకొనుటకై ఎవ్వరి కెవ్వరెంత యీయవలసియున్నదో లెక్కతేల్చ వలసి వచ్చినది. తుదకు క్షత్రియులు పాపమ్మారావుగారికి రూ. 10,000లు సుమారు ఈయవలసి వచ్చినది. ఈ సొమ్మును శ్రీరాములుగారే తెచ్చియిచ్చి సగభాగమును క్షత్రియుల వద్దనుండి పుచ్చుకొన్నారు. కొన్నాళ్లు ఆ గ్రామ పంటచెరువులను మరమ్మత్తు చేయించినారు. గ్రామ పరిపాలనా సందర్భములో ఆగ్రామ కర్ణమయిన గన్నవరపు కృష్ణయ్యతో పోరాడ వలసి పోరాడినారు. ఈ గన్నవరపు కృష్ణయ్యగారితో పోరాడుటలో అయూరిలో వైదీకి వెంపటి వెంకటప్పయ్యగారను నొకరు శ్రీరాములుగారికి సహాయము చేసినారు. ఈ వెంకటప్పయ్యగారు లౌక్యవ్యవహారపరీకుడేగాక స్మార్త కర్మల చేయించు నధికారము కలిగి యుండెను. పైపెచ్చు భూతవైద్యుడు. ఈ వెంకటప్పయ్యగారు తరువాత కొంతకాలము ఆ గ్రామ వ్యవహారములకై శ్రీరాములుగారు గుమాస్తాగా కూడా నుండెను. ఈ గ్రామము సుమారు 1907 వరకు మా

స్వాధీనములో నేయున్నది. కాని బుణబాధ వలన అమ్మివేయ వలసి వచ్చినది. గోపవరము ముఖాసాదార్లయిన కోటగిరి పురుషోత్తమయ్య రావుగారికి విక్రయంపబడెను.

1887వ సంవత్సరములో విక్టోరియా చక్రవర్తిని గోల్డెన్ జూబిలీ యుత్సవములు జరిగినప్పుడు ఏలూరులోన యువ సంఘమున నధ్వర్యము శ్రీరాములుగారే యుత్సాహముతో నుత్సవము నిర్వహించిరి. ఆ సందర్భమున విక్టోరియా రాణి రాజ్యపాలన విషయమై కొన్ని చక్కని పద్యములను, కీర్తనలను శ్రీరాములుగారు వ్రాసిరి. అందులోని యొకటి రెండు సీన పద్యములలోని పాదములలో నిముక్కలు నాకు జ్ఞాపకమున్నవి. "రేలు రధ్యలు రాపులరాలు గలిగె -- పెరులపని దూరవార్తయయ్యె" --- ఈ రెండు ముక్కలులోను రేలు, వైరులు అను శబ్దములు శ్లేషాద్యోతకములు. ఇంగ్లీషు, ఆంధ్రపదములశ్లేష, రేలు -- ఇంగ్లీషు రెయిల్, ఆంధ్రము రాత్రులు – వైరులు – ఇంగ్లీషు తీగెలు – ఆంధ్రము శత్రువులు -- రైలు, రోడ్ల వలన దూరప్రయాణము దాపు ప్రయాణమైనదనియు, రాత్రుల వీధులలో సొమ్ముదాచుకొనవచ్చుననియు, టెలిగ్రాం తీగెల వలన దూరవార్త వినవచ్చుట గలిగినదనియు, శత్రువుల బాధ తగ్గెననియు అర్థములలోశ్లేష.

1888 వ సంవత్సరమున, మార్చి, ఏప్రియల్ నెలలో శ్రీరాములుగారు ఒక విధమయిన బీజజాడ్యము వలన బాధపడిరి గాని దైవకృప వలన పై జెప్పిన మాడభూషి వేంకటాచార్యులవారి సహాయమున నెమ్మదించినది ---- 1887 సంవత్సరములో గుంటూరులో జరిగిన నాల్గవ కుమారుని వివాహసందర్భమున, ఆపట్టణముననున్న తెల్లవారికొక విందుబెట్టిరి. ఆ కాలములో ఇట్లు హిందువులు తెల్లవారికి విందులొనర్చుట, మృగ్యము ఈ విషయము శ్రీరాములుగారి హృదయ వైశాల్యమునకు కీర్తి సమార్జనాభిలాషకును నుదాహరణము.

1884 జూలయిలో ఏలూరునకు వచ్చిన తరువాత లౌక్యవ్యాపారములో నిమగ్నుడై ఇతర వ్యావృత్తుల కవకాశములేని హేతువుచే గ్రంధరచన బాహుళ్యముగా చేయలేదు. అప్పుడప్పుడు ఏ కొలది పద్యములో జావళీలు కృతులు పదములు మాత్రము చేయిచూ వచ్చిరి. ఈ కాలములో అనేకులు అనేక విద్యలలో అరితేరిన మహాపండితులు శ్రీరాములుగారి దర్శనము చేయుచు వారి వలన సన్మానింపబడుచూ వచ్చిరి. పండితుల సహాయమున ననేక శాస్త్రములలోని మర్మమలను గ్రహించి జ్ఞానాభివృద్ధి చేసికొనుచునే యుండిరి. తన లౌక్యవృత్తికి నావశ్యకమగుటచేతనేమి, యితర సందర్భములవలనేమి ధర్మశాస్త్రములను క్షుణ్ణముగా చదువుట తటస్థించినది. ధర్మశాస్త్ర పరిచయ విషయమున ఒకటి రెండు కథలను చెప్పక తీరదు. వాని బట్టి వీరి ధైర్యగుణమును కార్యదీక్షయు ప్రకటితమగును. 1890 సంవత్సరమున ఏలూరున కనతి దూరముననున్న వేంపాడు అనుగ్రామమున గుంటూరు భానుమూర్తి యను నొకవైదిక పురుషుడు ఉండెను. ఈతడింతకు పూర్వము ఒక నరహత్య నేరమున చిక్కుకొని యావజ్జీవద్వీపాంతర శిక్షబడసి అండమాను దీవులలో నుండి తుదకు 1887 సంవత్సరమున విక్టోరియా రాణీగారి గోల్డన్ జ్యూబిలీ సందర్భములో బంధవిముక్తుడై స్వదేశమునకు రాగల్గినాడు. వచ్చిన కొంతకాలమునకు ఒక బ్రాహ్మణకన్యను వివాహమాడెను. ఈ కన్య యొక్క జ్యేష్ట సోదరి యొకతె విధవయయి పునరుద్వాహము కావించి కొని, సికిందరాబాదు ప్రాంతముల నుండెనట. అప్పుడీ కన్యక అక్కగారి వద్ద కొన్నాళ్లుండుట తటస్థించినది.. ఈ విషయము భానుమూర్తికి తెలియదు. మోసములో చిక్కుకొని కన్యకమ వివాహమాడినాడు. ఈ విషయము కన్య కాపురమునకు రాకముందే, భానుమూర్తి గృహమందుండుటయు, లోకు లీయనను బహిష్కరించుటయు తటస్థముకాగా, అప్పటిలోక పరిస్థితులను బట్టి భానుమూర్తి భయ కంపితుడై, ఏలాగైనను ప్రాయశ్చిత్త కర్మననుభవించి పునీతుడై సంఘములో చేరవలెనను నభిలాషతో సమీప పెద్దపట్టణమైన ఏలూరునకు వచ్చి వైదిక బృందము నాశ్రయించగా, ప్రాయశ్చిత్తమున్న దనియు ప్రాయశ్చిత్తము చేయించెదమనియు మధురోక్తులు చెప్పి భానుమూర్తిని నమ్మించి, తుదకు పరివద్దక్షిణ విషయములో దరిద్రుడైన యాతని బాధించిరి. అంత విచారగ్రస్తుడై ఏమి చేయును దైవమా యని యలోచించి అప్పటిలో ఏలూరులో ప్రముఖ లౌక్యుడైన ధర్మశాస్త్రవేత్త యయి, దీనదయాపరుడై వైదికసన్మానపరుడై, ధైర్యశాలియయి, పట్టణ సంఘ నాయకత్వమును వహించి సద్గృహస్థుడుగ నివసించుచున్న శ్రీరాములుగారి వద్దకు శరణార్థియై భానుమూర్తి వచ్చి,

విషయమును దీనముగా మనవిచేసికొనగా, వైదిక బృందము చేసిన మహాపచారమును, వారి ధనాశను నిరసించి ధైర్యముతో తానే ప్రాయశ్చిత్త కార్యమును నిర్వహించి భానుమూర్తిని పునీతుని జేసి సంఘములో కల్పుదునని యభయ హస్తమిచ్చి పంపి కార్యనిర్వహణమున కారంభించిరి. ఈ నియోగి, వైదిక కర్మయగు ప్రాయశ్చిత్తమును ఎట్లు నెఱవేర్పగలడో చూతమను నొక యహంభావత్వము వహించియు, తమ ధన లాభమున కీ లొక్కుడిట్లు అడ్డు తగిలెనను ఈర్ష్య వహించియు, ఈ కార్యమున కాటంకము కలిగించుటకు భగీరథ ప్రయత్నములు సలిపి వైదికులందరొక కక్షగా నేర్పడిరి. నియోగు లిండ్లకు సాధారణ స్మార్తకర్మలకు రాకుండ బిగిసిరి. నియోగులందరు చాలవరకు శ్రీరాములుగారికి అండగా నుండిరి. కోమట్లు సహజ భీరువులై విముఖులుగా నుండిరి. కమ్మవారు అటునిటుగా నుండిరి. ఈ సమయములో శ్రీరాములుగారు ధైర్యమును కార్యదీక్షయు అద్భుతముగా జూపించిరి. శ్రీరాములుగారికి ఒక పెద్ద అవకాశము మాత్రమున్నది. ఏలూరునకు తూర్పుననున్న చాటపర్రు గ్రామ కాపురస్థులును, చైనాంతము శ్రౌతకర్మలను జేసినట్టి యును, వేదాధ్యయన పరులైనట్టియు ధర్మశాస్త్ర పారంగతుడై నట్టియు తెలగాన్యా శాఖా శిఖామణియయి నట్టియు ఉత్కృష్టమైన లౌకిక జ్ఞాన పరుడైన గుండు సుబ్రహ్మణ్య చైనులుగారు శ్రీరాములుగారికి పరమమిత్రులు. కార్య విషయమీ చైనులు గారితో సంప్రదించగా, శ్రీరాములుగారి యుద్యమము భావము ధర్మ నిర్వహణార్థ మనియు విధి విధానమనియు గుర్తించి, కార్యనిర్వహణములో తాము శ్రీరాములుగారికి తమ యావత్సహాయమును చేయ గల్గుదుమని అభయమిచ్చినారు. ప్రాయశ్చిత్త కర్మకు యాజ్ఞీకము తామే నిర్వహించుటకు చైనులుగారే నడుము కట్టిరి. శ్రీరాములుగారి పలుకుబడి వల వారి క్లైంటులు కొందరు ధనసహాయము చేయ నొప్పుకొనిరి. ఇకనేమి, ప్రాయశ్చిత్తకర్మ అవిచ్ఛిన్నముగా జరుగగలదు. ఒకనాడు ఏలూరు దక్షిణపు వీధిలో నున్న శ్రీ మార్కండేయస్వామి యాలయమున పతిత సంపర్గి యను పాతిత్యమునకు ప్రాయశ్చిత్త కర్మ ప్రారంభమయి చైనులుగారి యాజ్ఞికములో శ్రీరాములుగారి లౌక్యయాజమాన్యముతో, ఉదార పురుషుల ధన సహాయముతో, నిండు పరిషన్మధ్యమున నిర్విఘ్నముగా జరిగినది. శ్రీరాములుగారింటనే బ్రాహ్మణ సమారాధన జరిగినది. శ్రీ గుంటూరు భానుమూర్తి భార్యా సమేతముగా అవు పోసనము వడ్డించగా పరిషర్నమస్కారము చేయగా సుమారొక మూడువందల మంది తృప్తిగా భోజనము చేసినారు. భానుమూర్తికి వెలికితీరినది. మనోవైకల్యము తీరినది. ఏలూరులోను, తత్పరిసర గ్రామములలోను పెద్ద యలజడి బయలుదేరినది. ఏలూరు వైదికులుగాని చుట్టుప్రక్కల గ్రామ వైదికులుగాని ఏలూరు లౌక్యులిండ్లకు వచ్చుట మానిరి. వైదిక నియోగ కక్షలేర్పడినవి. ధర్మశాస్త్ర సభలు కూడినవి. ఈ సభలకు ప్రాయశ్చిత్తాభిముఖులు పక్షమున శ్రీరాములుగారు నాయకుడు. విముఖుల పక్షమున జంధ్యాల గౌరీనాధ శాస్త్రులగారు నాయకుడు. జంధ్యాల గౌరీనాధశాస్త్రులు గారు రేపల్లె తాలూకా కొల్లూరు కాపురస్తుడు. మంచి గీర్వాణ భాషా పండితుడు. శాస్త్రములు గూడ జదివినవాడు. ఆంగ్లమున బి.యె. ప్యాసుచేసి ఫస్టుగ్రేడు ప్లీడరయి, అంతకు గొన్నాళ్లకు ముందే ఏలూరునకు న్యాయవాదియై వచ్చి ఏలూరు సబుకోర్టులో వృత్తినారంభించి – వృద్ధియగుచున్నాడు. మంచి వక్త. మంచితర్కము. శ్రీరాములుగారును అంతవాడే. పైపెచ్చు అనుభవశాలి. ఇట్లు వీరి నాయకత్వమున ధర్మశాస్త్ర చర్చ జరిగెను. ఈ సభలో నాలుగు వేదములును, పదునెనిమిది స్మృతులును వైదిక స్మార్తాచారములును వైదిక కర్మలతో సంబంధించిన మరి యితర గ్రంధమును క్షుణ్ణముగా నుభయ పక్షముల పక్షమున చర్చింపబడెను. ఆ సందర్భములో శ్రీరాములుగారు వాదము లన్నిటిని క్రోడికరించి "పతిత సంపర్గి ప్రాయశ్చిత్త విషయకోపన్యాసమను" అచ్చులో సుమారు 70 పుటలకు మించిన గ్రంధమును రెండు రాత్రులలో వ్రాసి ముగించినారు. ధర్మశాస్త్ర విషయమైనప్పటికి గ్రంధము చదువుటకింపుగా నుండును. వైదికులు లౌక్యులిండ్లకు రాక నియోగులింట నిత్య నైమిత్తికము లాగిపోయినవని తలపవలదు. మహాపండితుడు, షోడశకర్మాధికారియు నియోగిశాఖకు చెందినవాడును మొదట కంచికచర్ల కాపురస్తుడైనను అప్పుడు అయ్యవారి రుద్రవర కాపురస్తుడును నైన అవ్వా జగన్నాధశాస్త్రి గారిని ఏలూరునకు సకుటుంబముగా పిలిపించి నిత్య నైమిత్తికములు జరుగునట్లు శ్రీరాములుగారు చేసినారు. పై చెప్పిన గౌరీనాధ శాస్త్రులవారి కుమారుడే ప్రస్తుతము బెజవాడలో సుప్రసిద్ధముగా వైద్యము చేయుచున్న జంధ్యాల దక్షిణామూర్తిగారు. బందరులో కొన్నాళ్లు వకీలు చేసిన అవ్వా కృష్ణమూర్తి గారు, జగన్నాధశాస్త్రులవారి కుమారుడు. గౌరీనాధశాస్త్రులవారు తరువాత బందరులో ప్రముఖులై న్యాయవాది వృత్తిలో నుండి చనిపోయినారు. అవ్వా

జగన్నాథశాస్త్రులు వారు కొంత కాలమునకు సన్యసించి తేలప్రోలులో గుడిపాటివారను గృహస్థుల యిండ్లలో నుండుచు సిద్ధి పొందినారు. సుమారిదేసమయములో 'అచార నిరుక్తి', 'దురాచార పిశాచ భంజని' యను రెండు ధర్మశాస్త్ర విషయక వ్యాసములు శ్రీరాములు గారు వ్రాసినారు. ఇందులో ఆచార నిరుక్తికి బొబ్బిలి కాపురస్తులును, న్యాయశాస్త్ర కోవిదుడునయి యప్పటిలో కొంత కాలము శ్రీరాములుగారింటిలో నుండిన పప్పు జగన్నాథశాస్త్రులు గారును 'దురాచార పిశాచ భంజనికి' తనకు మేనత్త కుమారుడైన ఉప్పులూరి కనకయ్య గారును వ్యాఖ్యానము వ్రాసినట్లు కల్పించి, వ్యాఖ్యాన సహితము శ్రీరాములుగారే వ్రాసినారు. కొన్ని దినముల తరువాత 'రండా ముండన ఖండనమను' నొక వ్యాసమును, విధవలముండనము ధర్మశాస్త్ర విరుద్ధమనియు క్రూరమైనదనియు ముండనము తప్పనియు నిరూపించి ప్రకటించినారు.

1893-94-95 ప్రాంతముల మనదేశములో వైశ్యులకు పురాణోక్త కర్మయే కాని వేదోక్త కర్మ పనికిరాదనియు ఒక సంచలనము పుట్టినది. అప్పుడు జగ్గయ్యపేట బందరు పురములలోని వైశ్యులు ధనవంతులుగాను ప్రముఖులుగాను నుండిరి. వారిలో కొందరు శుచిశుభ్రతలలో బ్రాహ్మణుల కంటె ఇనుమిక్కిలిగా నుండెడివారు. ఏ కారణముననో వైశ్యులకు వేదోక్త కర్మలు బ్రాహ్మణులు జరిగించుచుండుటలేదు. అప్పటిలో వైశ్యులకు తమరును వేదోక్త కర్మలకు అర్హులమని ప్రబోధమొకటి పుట్టెను. వేదోక్త కర్మాభిలాషులైరి. వైదికులిందులకు కినిసి వేదోక్త కర్మలను నిరోధించుటకు నడుము కట్టిరి. ధన సంపన్నులగుట వలన తాము నిర్వహించగలమని యొక మూలధైర్యమున్నను, సహభీరుత్వము వలన అట్టి పూర్వాచారమునకు భిన్నముగా నడిచిన నెత్తియణుచునేమో యను భీతి మరియొక మూలను చెందియుండిరి. బ్రాహ్మణులలో వేదోక్త కర్మ పక్షము, పురాణోక్త కర్మ పక్షము, అన్న శ్రాద్ధ పక్షము, ఆమ శ్రాద్ధపక్షము, ఇన్ని పక్షము లేర్పడినవి. వాదోపవాదములు జరుగుచుండినవి. ముఖ్యముగా బందరు, జగ్గయ్యపేట ఈ వివాదమునకు ముఖ్యస్థానములైనవి. ఆ సందర్భమున శ్రీరాములుగారు దేశప్రఖ్యాతి గలిగిన లౌక్యుడును ధర్మశాస్త్రవేత్తయు నగుట వలన వారిని వైశ్యులు కోరిన మీదట తమ వాదనలవలన వేదోక్త వాదమును నిర్వహించిరి. ఈ సమయములో శ్రీరాములుగారికిని ఒక స్వాముల వారికిని వాదమేర్పడినందున స్వాములవారు అర్ధరాత్రమున బందరు విడిచిపోయిరట. ఈ సందర్భములో బందరులో లౌక్యముగా శ్రీరాములుగారి యల్లునకు అన్నగారైన వేమూరి సుబ్బారావు గారు మున్నగువారు గౌరవముగా సహాయము చేసినారట. ఈ విషయమైన వాదనలును ధర్మశాస్త్రమును హైకోర్టు తీర్పులను క్రోడీకరించి వైశ్యధర్మదీపిక యను పెద్ద గ్రంథమును శ్రీరాములుగారు రచించిరి. ఇందలి పీఠికలోని యొక సీస పద్యపు పాదముల రెండిని వినోదమునకై యుదహరించుచున్నారు. "కోమటుల్ ద్విజులున్న కొమ్ములొడ్డారించు బసవన్న డువ్‌డువ్వు బాజడోలు, కోమటుల్ ద్విజులన్న కోపించి బుసకొట్టు నాగన్న కిల్లిల్లి నాగుస్వరము". ఇదే సందర్భమున, అన్నశ్రాద్ధ ఆమశ్రాద్ధ వివాద విచ్ఛేదనమునకై 'శ్రాద్ధ సంశయ విచ్ఛేది' యను నొక వ్యాసమును శ్రీరాములుగారు వ్రాసిరి. ఈ వేదోక్త పురాణోక్త గాథా ఫలితములు కొందఱకు తొందరలు కలిగించినవి. జగ్గయ్యపేటలోని కోమటులలో నీ తొందరలు ఎక్కువ కనిపించినవి. కోమటు లభిలషించిన యౌన్నత్యమును బ్రాహ్మణులు కొందరు సహించలేక కోమటులును ఇబ్బంది పెట్టదలచి యక్కడి పోలీసు మున్నగు యిలాకా యుద్యోగస్తులను ప్రోత్సాహపరచి, వైశ్య ప్రముఖులు శ్రీరాం జయరాముడు, గొల్లపూడి చిన నరసింహము విస్సంశెట్టి వెంకటరత్నము మున్నగవారు వెనుక డెకాయిటీ యభియోగమును కల్పించినారు. ఈ జిల్లా కోర్టు సెషన్సుకు కమిట్ అయినప్పుడిచ్చట విచారణ జరిగిన యెడల న్యాయము జరుగదని తలచి ముద్దాయిలు హైకోర్టులో పిటీషను పెట్టి కేసును విచారణ నిమిత్తము బళ్లారి సెషన్సుకు మార్పించుకొన్నారు. ఆ కోర్టులో విచారణపైన ముద్దాయిలందరు విడుదలయినారు. ఆ యభియోగమునకు ముఖ్య తాంత్రికుడు కాటూరు నారాయణస్వామి నాయుడను నొక పోలీసు ఇన్‌స్పెక్టరు. ముద్దాయిలను విడుదల చేసి, అబద్ధపు కేసు బనాయించి అబద్ధపు సాక్ష్యము నిచ్చినందుకు ఇన్‌స్పెక్టరు ప్రాసిక్యూషనుకు సెషన్సు కోర్టువారు అనుజ్ఞనీయగా కేసు విచారణ అయి ఇన్‌స్పెక్టరుగారికి శిక్ష విధింపబడినది.

1890 ప్రాంతమునకో, 1891 లోనో ఏలూరులో పోలీసు పరీకు వలన దొంగతనములు మెండవగా, అట్టి దుండగీడుల నిరోధించుటకై డి ॥ మ్యాజిస్ట్రేటు వద్దకును, డి ॥ సూపరింటెండెంటువద్దకును శ్రీరాములుగారు నాయకుడుగానుండి యొక రాయబారము పోగా అధికారులు విమర్శించి యేలూరులో పోలీసు లందరిని ఏక్దమ్మున బదలాయించిరి.

1890 ప్రాంతములలో బళ్లారిలోనున్న 'సరస వినోదినీ' సభవారు ధర్మవరము కృష్ణమాచార్యులవారి నాయకత్వము క్రింద క్రొత్త ఫక్కిని మదరాసులో నాటకము లాడుచుండిరి. ఈ సందర్భములో శ్రీరాములుగారు 'జానకీ పరిణయమును' నాటక మును పద్యగీతములతో ఆంధ్రీకరించిరి. మరియు 'మనో లక్ష్మీ విలాసమును' నొక స్వతంత్ర నాటకమును అదే పక్కీని రచించిరి. ఈ 'మనోలక్ష్మీ విలాసము' ప్రభోదచం ద్రోచయము వలెనుండెను. ఈనాటకమును రంగస్థలముపై, శ్రీరాములు గారాడించిరి. ఈ 'జానకీపరిణయ' 'మనోలక్ష్మివిలసములు', లోని నాటకములలోని సంగీతభాగములోని పాటలకు కొండూరి నరసింహాచార్యులు గారు అనునొక ఘననాయకుడు మట్లువేసినారు. ఈ నరసింహాచారిగారును వీరి యన్నగారును రేపల్లి తాలూకా ఉల్లిపాలెము గ్రామమువారు. తచ్చూరి సింగరాచార్యులవారనెడి మహాప్రసిద్ధి చెందిన గాయకునివద్ద మదరాసులో సంగీతము నభ్యసించినారు. నరసింహాచార్యులవారిది గొప్పగాత్రము. సుఖముగా నిరుద్దష్టముగా పాడెడివారు. వీరియన్నగారు వైయోలిను మీద వాయించుచుండెడివారు. వీరిప్పుడెక్కడ నున్నారొ?

శ్రీరాములుగారు ఏలూరులో నున్నంతకాలము విద్యాగోష్ఠులు, సంగీతసభలు సతతము వారింటనే జరుగుచుండెడివి. శ్రీరాములు గారు కళాప్రియుడు. సంగీతశాస్త్రమునందభిరుచియేగాక, భరతశాస్త్రమునందు వీరికి ప్రవీణ్యకలదు. 'అభినయదర్పణమ'ను నొక గ్రంథమును రచించిరి. స్వయముగా అభినయము పట్టినేర్చియుండిరి. అభియనముచూపించెడువారు. వేశ్యామేళములలోనికి వీరువెళ్లుట తటస్థించియెడల వేశ్యలు ఆడుటకు భయపడుచుండిరి. భరతశాస్త్ర ప్రవీణురాంధ్రయిన చదలవాడ పిచ్చాయి, చక్రధరరావు తల్లి, పినపాలభవాని, గుంటూరులోని వేశ్య, చెదలవాడ రాజరత్నము మున్నగు ప్రవీణులయిన భరతశాస్త్రజ్ఞానులు శ్రీరాములుగారియెదుట నభినయించి పేరొందినవారే. చదలవాడ పిచ్చాయి 1893లో రాజమంధ్రిలో జరిగిన పెండ్లికి తన అక్కగారైన చదలవాడ మధురము – గోపీనాధముగారి తల్లితో మేళము చేసినది. గుంటూరులో 1887 సంవత్సరమున జరిగిన గోవిందరావు, నా అన్నగారి, పెండ్లిలోను, 1888 సంవత్సరమున అల్లూరులో జరిగిన నాచెల్లెలు శారదాంబ వివాహములోను ఆడినదే. 1887 సంవత్సరమున విక్టోరియారాణి జ్యూబిలీ సమయమున రాజరత్నమాడినదే.

వీరు యేలూరులో ప్లీడరిచేయుచున్న సమయములో వీరిదర్శనము చేసి వీరి వలన సన్మానము బొందిన పండితులను కవులను గాయకులను కళావంతులను ఎంచిచ్రాయచూచుట ఒకవిధముగా నక్షత్రగణనమే యగును. కాని కొందరిని మాత్రము ఇక్కడ ఉదహరించుచున్నాను. గరికిపాటి రామశాస్త్రులువారు పరిమి శివయ్యశాస్త్రులుగారు, రామకృష్ణ శాస్త్రులవారు – వీరంటిపేరు మరచినాను, పప్పు జగన్నాధశాస్త్రుల వారు, పన్నాల రామబ్రహ్మణశాస్త్రులవారు, నల్లాన్ చక్రవర్తుల తిరువేంకటాచార్యులవారు, శోభనాంధ్రాచార్యులవారు, రామానుజయ్య, అళహసింగరులను నిద్దరు మదరాసు సాత్తాని కులస్తులు, కాళహస్తి శాస్త్రిగారు, కంచినుంచి వచ్చిన ఇద్దరు ఘననాయకులు – వీరిని మేము చిన్నతనములో పెద్దదుప్పి, చిన్నదుప్పి యనెడివారము. అనంతశయనము వారు అనునొక భరతశాస్త్ర అయ్యరుగారు మున్నగువారు. దివాకరుని తిరుపతి శాస్త్రులువారు చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారును, గాయకులును హరికధా గాయకులునైన ఆదిభొట్ల నారాయణ దాసుగారును, వారి ప్రాధమిక దశలో శ్రీరాములుగారి యాతిధ్యములను పొందినవారే. పండిత వంశజులును, రాజమంధ్రి కాలేజీ ప్రొఫెసరుగారును నగు వావిలాల వాసుదేవశాస్త్రిగారు శ్రీరాములుగారి ముఖ్యస్నేహితులలో నొకరు.

శ్రీరాములుగారి విద్యాభిమానముకును నౌదార్యముకును దర్పణములుగానుండు ఒకటి రెండు ముఖ్యాంశముల చెప్పుట మిక్కిలియావశ్యకము. 1886 సం॥లో బసవరాల రామబ్రహ్మముగారను నొక మధ్యవయస్కుడు, ఆంగ్లేయభాషాప్రవీణుడు ఏలూరు మిడిలీస్కూలులో నుపాధ్యాయుడుగానుండి యన్యాయముగా ఆ స్కూలు సంఘమువారివలన నుద్యోగమునుండి తొలగింపబడి

నిరాధారుడుగానుండి శ్రీరాములుగారి నాశ్రయించగా, వారి విద్యాబోధ నైపుణ్యమును, శీలమును, ఆంగ్లేయ విద్యాప్రవీణతయు నిరాధారతయు గనిపెట్టి, రామబ్రహ్మముగారికి నాధారము గల్పించి వారిని ప్రోత్సాహపరచుట యోగ్యమని తలచి, ధైర్యముతో నూతనముగా శ్రీరాములుగారు 'హిందూ పేట్రియాటిక్' స్కూలును స్థాపించి యందులో రామబ్రహ్మముగారిని ప్రధానోపాధ్యాయునిగా నియమించిరి. ఈస్కూలు నిర్వహణమునకై శ్రీరాములుగారు లోకులవలన కొంతధనమును నార్జించినను తాము స్వయముగా కొంత ధనము వెచ్చించిరి. నేను, నా అన్నగారు, నా తమ్ముడు, మేనమామగారగు కూరాడ బాలకృష్ణరావుగారును నీస్కూలులో చదివినవారమే. ఇట్లీ స్కూలు 5 సం॥లు నడుపబడెను. తుదకు 1891 సంవత్సరమున నీస్కూలు నిలిచిపోయెను.

శ్రీరాములుగారు సహజముగా సంగీతప్రియుడగుటచేతను, ఆప్రాంతముల గానవిద్య అధోదశలోనున్నందునను దానినుద్ధరించుటకును, గాయకుల ప్రోత్సాహముచేయుటకును ఏలూరులో నొకసంగీతపాఠశాలను శ్రీరాములుగారు నెలకొల్పినారు. ఈపాఠశాలలో ప్రథమమున గాయకులుగా చొదిమెళ్ల కాపురస్తులు శ్రీవైష్ణవులు, పండితవంశజులైన శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల తిరువేంగడాచార్యులవారు నియమింపబడిరి. కీ.శే. గబ్బిట యజ్ఞనారాయణగారను ఉత్తమగాయకులు ఈ పాఠశాలలో అభ్యసించినవారే. ఈయాచార్యులవారిద్దరును నేటికిని మైలవరములో వృద్ధులైయున్నారు. దేశములోని గాయకులును, పరదేశీయులునైన గాయకులును ఆసమయమున నీపాఠాశాలా యాజమాన్యమున సన్మానము పొందుచునేయుండిరి. ఈయాచార్యులవారిరువురును ఇప్పటికిని మాకుటుంబ స్నేహితులుగా నున్నారు.

వీరుగాక పైన నొకసందర్భములో పేర్కొనబడిన రామానుజయ్య అళహసింగరుగారలు శ్రీరాములుగారు మొదటనిచ్చిన ఊతమువలన ఏలూరులోనే యుండి సంగీతపాఠముల జెప్పుచుండిరి. ఈరామానుజయ్యగారు పదముల పాడుటలో అఖండుడు. వీరి గాత్రము సర్వగుణసంపన్నము. కాని త్రాగుబోతయినాడు. తరువాత కొన్నాళ్లు పిఠాపురములోనుండి చనిపోయినాడు. ఈయనను గురించి చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు అప్పుడప్పుడుగ్గడించెదరు. శ్రీరాములు గారి "తత్తరపడనేల తాళు తాళుసామి ..." యనుపదమును రామానుజయ్యగారు పాడగా లక్ష్మీనరసింహముగారు విని దానిని వారిటీవలన సినీమాకైవ్రాసిన 'కాసుల పేరను' ప్రహసనములో లక్ష్మీనరసింహంగారుపయోగించిరి.

శ్రీరాములుగారి సంగీతాభిమానమును వెల్లడిచేయు నింకొక యంశము చెప్పదగియున్నది. సుమారు ఏబది సంవత్సరముల నాడు మనదేశమున స్త్రీ విద్య యెట్టి దశలోయున్నదియు, స్త్రీల స్థితి యెట్లున్నదియు నేను వేరుగ చెప్పనక్కరలేదు. అప్పుడు స్త్రీలు చదువుట మహాపాపముగ నెన్నబడుచుండె. స్త్రీలు సంగీతము బాడుట సంగతి యింకేమిచెప్పను? సంగీతముపాడు స్త్రీని వేశ్యతోసమానముగా నెన్నుచుండినకాలమది. ఇట్టిస్థితులలో శ్రీరాములుగారు స్త్రీవిద్య యత్యావశ్యకమనియు సంగీతము పాడుటకు పురుషులకంటె స్త్రీలే తగినవారనియు, ఈరెండును ఎంతమాత్రము దూష్యములుగావనియు నమ్మి యీరెండింటికి ప్రోత్సాహ మొనర్చుటలో తనయేడేండ్లె కుమార్తె శారదాంబకు సంగీత సాహిత్యములు రెండును నేర్పింప ప్రారంభించిరి. లోకనిందను ఎంతమాత్రము లక్ష్యము చేయలేదు. ఈమె సంగీతవిద్యకై కొందరు గాయకులను శ్రీరాములుగారు పోషించినారు. వీరిలో ఈమని వెంకటరత్నము గారను వారొకరు. కొండూరి నరసింహాచార్యుల వారొకరు. మరికొందరుండిరి. వీరిపేర్లు నాకిప్పుడు జ్ఞాపకము వచ్చుటలేదు. శారదాంబ సంగీత సాహిత్యవిద్యా విషయము శారదాంబ చరిత్రలో మరికొంత వ్రాసెదను.

ఇక శ్రీరాములుగారి భరతశాస్త్ర వైదుష్యము – పైననే వ్రాసినాను. అప్పుడు ఏలూరులో తూతాసింగరయ్యగారను వారొకరును, పొతనూరులో పరిమి సుందరమను వారును బోగమువాండ్రకు సంగీతమునకుగాకపోయినను అభినయనమునకు ప్రసిద్ధినొందినారు. గుంటూరు బోగమువాండ్రు సంగీతమునకు ప్రసిద్ధినొందినారు. పైజెప్పిన పిసుపాల భవానీ యాగుంటూరు సంఘములోనిదే. వీధులలో పూర్వకాలమున నాడబడుచూ వచ్చిన భాగవతము 'కృష్ణపారిజాతమను' నామము గలిగినది. ఇందలి 'భామ – సత్యభామ' భూమికధారుల యౌత్కృష్టమును బట్టి ఆయాట గణింపబడుచున్నది. కూచిపూడి భాగవతులు సాధారణముగా పురుషులనే యీభామ భూమిక కేర్పరుచుచుండిరి. కాని కొందరు బోగమువాండ్రీ భూమికను కడుకౌశల్యముతో

నిర్వహించుచుండిరి. వీరిలో అప్పటిలో ఏలూరులోని 'ఆరువేల్ల మాణిక్యము', 'చాటపర్రు సందరి', అనునిద్దరు ప్రముఖులుగా నుండిరి. తమ సహజ సౌందర్యము వలనను, విలాసములవలనను, అంగవిన్యాసముచేతను తమసంగీత భరత అభినయవిద్యా ప్రావీణ్యముచేతను వీరు సభికుల నలరించుచుండిరి. ఆకాలములో సంగీత, భరత విద్యలు వేశ్యావృత్తియే ముఖ్యవృత్తి, జీవన వృత్తిగాచే నది కొన్ని వేశ్యలపాలయి యుండుటచే నావిద్యలయుందు గౌరవము లోకులలో తగ్గియుండుట సహజము. రానురాను కాలములు మారినవి. లోకులభావములలో, లోకుల ఆచార్య వ్యవహారములలో అనేక పరివర్తనలు కలిగినవి. పాశ్చాత్యవిద్య, పాశ్చాత్యదేశ పర్యటనము విస్తరించినది. మూఢవిశ్వాసములు తగ్గినవి. సత్యాసత్య నిరూపణము హెచ్చగుచున్నది. కాలవిద్యా విశేషమువలన దేశస్థితులు మారుచున్నవి. స్త్రీవిద్య ప్రబలినది. స్త్రీ స్వేచ్ఛ పెరిగినది. స్త్రీలను పూర్వరీతిని పురుషులు క్రూరముగా చూచు దినములు పోవుచున్నవి. స్త్రీలలో సంగీత భరతాది విద్యలు ప్రబలుచున్నవి. కాని యిది యంతయు మంచి మార్గముననే నడుచుచున్నదని చెప్పబడు మాత్రము సందేహించుచున్నాను. ప్రస్తుత సినీమాలను జూచిన సంఘము కొన్ని విషయములలో పూర్వము కంటె అధోగతిక మగుచున్నది. ఏమో యను శంక నాచిన్న బుద్ధికి తోచుచున్నది.

1892 సం॥లో వీరి కవితా శైలిని పండిత లోకమున కెఱుక పరచినట్టి 'తెనుగునాడ' నే నొక చిన్న పుస్తకమును రచించిరి. దీనికే 'ఆంధ్రవీధి యను' నామాంతరము గలదు. తెనుగు దేశములోని వివిధ కులముల వర్తనముల వర్ణించుట యొక్క నుద్దేశముతో నీగ్రంధము మొదలిడబడినది. కాని బ్రాహ్మణ ప్రశంసతో నిలిచి పోయినది. ఈ పుస్తకము ఒక్కసారిగా కూర్చొని వరుసగా వ్రాసినది కాదు. అప్పుడప్పుడు తమకు విశ్రాంతి యున్నపుడు వినోదముగా తాత్కాలికముగా దోచిన భావములను వెల్లడిచేయుచు వ్రాయబడిన పద్యముల సముదాయమీ పుస్తకము. చక్కగా జాతీయముల నిమిడ్చి మనోహరమైన చదువరులకు వినోదము కలిగించునట్టి పద్యములతో నిండియున్నది. చదువునప్పుడు చదువరులకొక నవ్వును ఆహ్లాదమును గలిగించును. ఈ పుస్తకమును రచించిన సంవత్సరాదులు ... 'నలదుని నందుండు విడనాడె భువిని గొలివన్ ...' ననుకొక పద్యముఖమున వెల్లడిచేయబడినది. – నందననామ సంవత్సరము ... ఈ పుస్తకము శైలి తెల్పుటకొకటి రెండు పద్యములు చాలవు. అన్ని పద్యములు రసయుక్తమెలు. దీనిని గూర్చి వేంకటశాస్త్రిగారు .....

– మిగిలిన పుటలు కాలగర్భములో కలిసిపోయినవి –